
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

కర్నూలు జిల్లా వార్తలు

5

సోమవారం 13 మే 2024









తీర్పు ఇద్దాం.. పదండి



- నేడు పోలింగ్.. సర్వం సిద్ధం చేసిన యంత్రాంగం
- ఓటు వేయనున్న 20.54 లక్షల ఓటర్లు
- విధుల్లో 14,561 మంది సిబ్బంది
- ఉదయం 7 గంటల నుంచి 6 గంటల వరకు పోలింగ్
- ప్రలోభాలకు ప్రయత్నిస్తున్న అభ్యర్థులు



కర్నూలు, మే 12 (ఆంధ్రజ్యోతి): నేడు ఓటరు తీర్పు. ఇది ఐదేళ్ల భవిష్యత్తును నిర్ణయిస్తుంది. మన బతుకులు ఎలా ఉండాలో నిర్దేశిస్తుంది. ఈ ఎన్నికలు రాబోయే ఐదేళ్ల పాలనకు అంకురార్పణ చేస్తాయి. కొత్త ప్రభుత్వాన్ని, కొత్త మన నాయకుడిని నిర్ణయిస్తాయి. స్వేచ్ఛ, సమానత్వం ఉండే ప్రజాస్వామ్యాన్ని పరిపూర్ణం చేస్తుంది! అందుకే ఓటేయడానికి ఓటర్లు సిద్ధమవుతున్నారు. సార్వత్రిక ఎన్నికల్లో కీలక ఘట్టమైన పోలింగ్‌కు ఆదివారం నియోజకవర్గాల కేంద్రాల్లో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ రిసెప్షన్ కౌంటింగ్ (డీఆర్‌సీ) కేంద్రాల నుంచి బ్యాలెట్ కంట్రోల్ యూనిట్లు, ఈవీఎంలు, వీవీ ప్యాట్ యంత్రాలతో సిబ్బంది పోలింగ్ కేంద్రాలకు తరలి వెళ్లారు. జిల్లాలో కర్నూలు పార్లమెంట్ పరిధిలో కర్నూలు, కోడుమూరు (ఎస్సీ), ఎమ్మిగనూరు, మంత్రాలయం, ఆదోని, ఆలూరు, పత్తికొండ, నంద్యాల పార్లమెంట్ పరిధిలో పాణ్యం నియోజకవర్గం కలిపి 8 అసెంబ్లీ నియోజవర్గాలు, కర్నూలు లోక్‌సభ నియోజకవర్గానికి పోలింగ్ జరగనుంది. 20,54,563 మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. 2,204 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. 14,561 మంది సిబ్బంది ఎన్నికల విధుల్లో పాల్గొననున్నారు. 3,500 మంది పోలీసు సిబ్బంది బందోబస్తు నిర్వహించనున్నారు. సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక కేంద్రాలు 338 ఉన్నాయి. ఆ కేంద్రాల వద్ద ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ జి. కృష్ణకాంత్ తెలిపారు. ప్రశాంతంగా ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేశామని, ప్రతి ఓటరు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టరు డాక్టరు జి. సృజన పేర్కొన్నారు.

పోలింగ్ కేంద్రాలకు చేరుకున్న సిబ్బంది

జిల్లాలో 8 అసెంబ్లీ నియోజకవర్గాల్లో పోలింగ్ పోలింగ్ సిబ్బంది తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. అత్యధికంగా పాణ్యం నియోజకవర్గంలో 357, అత్యల్పంగా మంత్రాలయం నియోజకవర్గంలో 237 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. ప్రతి పోలింగ్ కేంద్రంలో పీవో, ఏపీవో, ఏపీవో ముగ్గురు సిబ్బంది విధులు నిర్వహిస్తారు. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఓటు హక్కు వినియోగించుకోవడానికి అవకాశం ఉంది. ప్రతి పోలింగ్ కేంద్రంలో నగటున 1,400 ఓటర్లు ఉంటారు. కర్నూలు నియోజకవర్గం డిస్ట్రిబ్యూషన్ రిసెప్షన్ కౌంటింగ్ (డీఆర్‌సీ) అవుట్ డోర్ స్టేడియం, కోడుమూరు, పాణ్యం నియోజకవర్గాల డిస్ట్రిబ్యూషన్ రిసెప్షన్ కౌంటింగ్ (డీఆర్‌సీ) కేంద్రాలు సిల్వర్ జుబ్లీ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాలను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టరు జి.సృజన సందర్శించి సామగ్రి పంపిణీ తీరును పరిశీలించారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఎమ్మిగనూరు, మంత్రాలయం, పత్తికొండ, ఆలూరు, ఆదోని నియోజకవర్గాల్లో డిస్ట్రిబ్యూషన్ రిసెప్షన్ కౌంటింగ్ (డీఆర్‌సీ) కేంద్రాల్లో ఆర్‌ఓల పర్యవేక్షణలో ఎన్నికల సామాగ్రి అందజేశారు. ఆ కేంద్రాల నుంచి ప్రత్యేక బస్సుల్లో సిబ్బంది పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు.

మహిళా ఓటర్లే: జిల్లాలో 20,54,563 మంది ఓటర్లు ఉన్నారు. అందులో పురుషులు 10,13,794, మహిళలు 10,40,451 ఓటర్లు ఉన్నారు. నేటి తీర్పులో మహిళా ఓటర్లే కీలకం కానున్నారు. పురుషులతో పోలిస్తే 26,657 ఓటర్లు అధికంగా ఉన్నారు. కర్నూలు, పత్తికొండ, ఎమ్మిగనూరు, మంత్రాలయం, ఆదోని, ఆలూరులో మహిళా ఓటర్లు ఎక్కువగా ఉన్నారు. వారు ఇచ్చే తీర్పు కీలకం కానుంది.

తొలిసారి ఓటు హక్కు

తొలిసారిగా 56,067 మంది యువత ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. కలెక్టరు డాక్టర్ జి. సృజన కాలేజీలు, కోచింగ్ సెంటర్లకు బీఎల్‌ఓలను పంపి 10-19 ఏళ్ల వయసు కలిగిన యువతను ఓటర్లుగా నమోదు చేయించారు. ప్రతి నియోజకవర్గం నుంచి 6 వేల నుంచి 9 వేల వరకు యువ ఓటర్లు ఉన్నారు. దివ్యాంగులు 23,940 మంది ఉన్నారు.

ఈ రికార్డుల్లో ఏది ఉన్నా ఓకే: ఓటరు జాబితాలో పేరు ఉండి.. ఓటరు గుర్తింపు కార్డు లేకున్నా, మిగతా 12 కార్డుల్లో ఏదైనా ఒకటి చూపించి ఓటు వేయవచ్చు. అవి.. 1. ఆధార్ కార్డు, 2. ఉపాధి హామీ జాబ్ కార్డు, 3. పోస్టాఫీస్ లేదా బ్యాంకు జారీ చేసిన ఫొటోతో కూడిన పాస్‌బుక్, 4. కార్మిక శాఖ జారీ చేసిన హెల్త్ ఇన్సూరెన్స్ స్మార్ట్ కార్డు, 5. డ్రైవింగ్ లైసెన్స్, 6. పాన్ కార్డు, 7. ఆర్‌జీఐ ద్వారా జారీ చేసి స్మార్ట్ కార్డు, 8. ఫొటోతో కూడిన పింఛన్ మంజూరు డాక్యుమెంట్, 9. ఫొటో కూడిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం/ పీఎస్‌యూ, పబ్లిక్ లిమిటెడ్ కంపెనీల ఉద్యోగ గుర్తింపు కార్డు, 10. ఎమ్మెల్యే, ఎంపీ, ఎమ్మెల్సీ జారీ చేసిన అధికార గుర్తింపు పత్రం, 11. దివ్యాంగుల గుర్తింపు కార్డు, 12. ఇండియన్ పాస్ పోర్టు

పోలింగ్ ఏర్పాట్లు

నియోజకవర్గం	బ్యాలెట్ యూనిట్స్	కంట్రోలింగ్ యూనిట్స్	వీవీ ప్యాట్స్
కర్నూలు	606	309	325
పాణ్యం	425	425	456
పత్తికొండ	302	306	321
కోడుమూరు	325	328	346
ఎమ్మిగనూరు	320	325	347
మంత్రాలయం	281	281	300
ఆదోని	206	304	329
ఆలూరు	347	351	377
మొత్తం	**2,912**	**2,629**	**2801**





పంపిణీ కేంద్రంలో ఉద్యోగులు

ఎన్నికల సామగ్రితో వెళ్తున్న ఉద్యోగులు



ఏర్పాట్లలో నిమగ్నమైన ఆర్వో భార్గవ్ తేజ



ఎన్నికల సామగ్రితో బయలుదేరిన పోలింగ్ అధికారులు



బస్సుల్లో పోలింగ్ కేంద్రాలకు వెళ్తున్న ఎన్నికల అధికారులు



ఉద్యోగులను తరలించేందుకు సిద్ధంగా ఉంచిన బస్సులు



సిల్వర్‌జూబ్లీ డిగ్రీ కళాశాలలో వివరాలు సేకరిస్తున్న దృశ్యం



సిల్వర్ జూబ్లీ కాలేజీలో ఉద్యోగులకు భోజనాలు



ఎన్నికల సామగ్రిని తీసుకెళ్లేందుకు వచ్చిన ఉద్యోగులు

---

7 గంటలకే పోలింగ్

ప్రారంభమవ్వాలి

జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సృజన



కర్నూలు(కలెక్టరేట్), మే 12: సార్వత్రిక ఎన్నికల పోలింగ్ సోమవారం ఉదయం 7 గంటలకు కచ్చితంగా ప్రారంభించాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా.జి.సృజన అధికారులను ఆదేశించారు. పోలింగ్ సన్నద్ధతపై రిటర్నింగ్ అధికారులతో, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులతో, ఎంపీడీవో, నోడల్ అధికారులు, సెక్టార్ అధికారులతో ఆదివారం కలెక్టర్ టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉదయం 5.30 గంటలకు మాక్ పోల్ ప్రారంభించి 6.30 గంటలకు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. సెక్టార్ ఆఫీసర్లు ఉదయం 7 గంటలకు అన్ని పోలింగ్ స్టేషన్లకు వెళ్లి అన్ని మిషన్లు పని చేస్తున్నాయా లేదా అని తెలుసుకోవాలన్నారు. ఆర్వో, ఏఆర్వో, సెక్టార్ ఆఫీసర్లు ఏదో ఒక పోలింగ్ స్టేషన్‌లో మాక్‌పోల్‌కు హాజరు కావాలన్నారు. ప్రతి రెండు గంటలకు ఒకసారి పోలింగ్ శాతానికి సంబంధించిన నివేదికలను పంపించాలన్నారు. టెలి కాన్ఫరెన్స్‌లో ఆర్వోలు, ఏఆర్వోలు, నోడల్ అధికారులు, సెక్టార్ ఆఫీసర్లు తదితరులు పాల్గొన్నారు.

ఓటుకు నోటు కోసం

పోలీస్‌స్టేషన్‌కు వెళ్లిన ఓటర్లు!

- మా ఓటుకు డబ్బు ఎందుకివ్వరు?
- నాయకులపై ఓటర్ల ఆగ్రహం
- మద్దికెరలో తప్పని చెప్పి వెనక్కి పంపిన పోలీసులు

మద్దికెర, మే 12: 'మాకు ఓట్లు లేవా... మాకు డబ్బులు ఎందుకు ఇవ్వరు.. మేం ఏ పార్టీకి చెందిన వాళ్లం కాదు. మాకు పార్టీలతో ఏ సంబంధం లేదు.. మాకు ఇవ్వాల్సిన డబ్బులు ఇవ్వండి..' అంటూ మద్దికెరలో కొందరు ఓటర్లు రాజకీయ పార్టీలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతటితో ఆగకుండా మా ఓట్లకు డబ్బులు ఎందుకు ఇవ్వరంటూ పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించడం చర్చనీయాంశంగా మారింది. పత్తికొండ నియోజకవర్గంలోని మద్దికెర మండల కేంద్రంలో వైసీపీ, టీడీపీ నాయకులు ఓటుకు రూ.వెయ్యి చొప్పున పంపిణీ చేశారు. శనివారం మధ్యాహ్నం నుంచి పంపిణీ చేపట్టారు. అయితే ఆదివారం సాయంత్రం డబ్బులు అందని ఓటర్లు రాజకీయ నాయకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మద్దికెరలోని ఎస్సీ కాలనీ, మద్దమ్మవ్వ వీధి, ఆయా కాలనీల్లో కొంత మంది ఓటర్లకు డబ్బులు ఇవ్వకుండా వెళ్లిపోవడంతో గొడవకు దిగారు. తమ వాళ్లకు డబ్బులు ఎందుకు ఇవ్వరంటూ ప్రశ్నించారు. మరికొన్ని చోట్ల కొన్ని ఇళ్లకు ఇవ్వకుండా పంపిణీ చేసే నాయకులు వెళ్లిపోతుండటంతో మండల నాయకత్వానికి ఫిర్యాదు చేశారు. 'ఇస్తే అందరికీ ఇవ్వాలి.. లేకపోతే.. ఎవరికీ ఇవ్వకూడదు..' అంటూ నిలదీశారు. మద్దికెరలో 12వేల ఓట్లు ఉన్నాయి. అయితే.. 80 శాతం మంది ప్రజలకు మాత్రమే డబ్బులు ఇవ్వాలని నిర్ణయించుకున్నారని నాయకులు వచ్చిన వారికి సమాధానమిస్తున్నారు. కొంత మంది డబ్బులు ఇవ్వకపోవడంతో నాయకుల ఇళ్లకు పరుగులు పెట్టి ఆందోళనకు దిగారు. మరికొంత మంది పోలీస్ స్టేషన్లకు వెళ్ళి 'తమ ఓటుకు డబ్బు ఇవ్వలేదు..' అంటూ పోలీసుల ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో ఖంగుతిన్న మద్దికెర పోలీసులు 'ఇక్కడకు రాకూడదు. అసలు ఓటుకు డబ్బులు తీసుకోవడమే తప్పు..' అంటూ వారికి అవగాహన కల్పించి పంపారు. దీంతో డబ్బులు అందని ఓటర్లు శాపనార్థాలు పెడుతూ నిరుత్సాహంతో వెనుదిరిగారు. మద్దికెర గ్రామానికి చెందిన ఓ ప్రజాప్రతినిధి భర్తను మెయిన్‌బజారులో మహిళలు నిలదీశారు. కొందరు నాయకులు కావాలని తమకు డబ్బులు ఇవ్వలేదని శాపనార్థాలు పెట్టారు. గతంలో కూడా ఇలాగే డబ్బు ఇస్తామని చెప్పి మోసం చేశారని ఆరోపించారు. ఐదేళ్లకు ఒకసారి ఇచ్చే డబ్బులు కూడా అందరికీ ఇవ్వకపోతే ఎలాగని ప్రశ్నించారు.



నాలుగు వేల మంది

పోలీసులతో భద్రత

- 144 సెక్షన్ అమలు
- 320 సమస్యాత్మక కేంద్రాల్లో గట్టి నిఘా..
- డ్రోన్ కెమెరాలు, స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్సులు, ఫ్లయింగ్ స్క్వాడ్‌తో నిఘా



కర్నూలు, మే 12: సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌కు 4వేల మంది పోలీసు బలగాలతో ఎస్పీ జి.కృష్ణకాంత్ ఆధ్వర్యంలో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. జిల్లాలో 2,204 పోలింగ్ కేంద్రాలు ఉండగా.. వాటిలో 320 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలుగా గుర్తించారు. పోలింగ్ కేంద్రాలకు వంద మీటర్ల పరిధిలో ఎవరూ గుంపులుగా ఉండకుండా చర్యలు చేపట్టారు. సంబంధం లేని వ్యక్తులను పోలింగ్ కేంద్రాలలోకి అనుమతించకూడదని ఆదేశాలు ఉన్నాయి.

- **బందోబస్తు ఇలా:** ఎస్పీ జి.కృష్ణకాంత్ ఆధ్వర్యంలో నాన్ కేడర్ ఎస్పీ ఒకరు నలుగురు అడిషనల్ ఎస్పీలు, 14 మంది డీఎస్పీలు, ఇద్దరు ట్రైనీ డీఎస్పీలు, 47 మంది సీఐలు, ఆర్‌ఐలు, 74 మంది ఎస్‌ఐలు, 40 మంది ట్రైనీ ఎస్‌ఐలు, 477 మంది ఏఎస్‌ఐలు, హెడ్ కానిస్టేబుళ్లు, 8 మంది ఏఆర్‌ఎస్‌ఐలు, 136 మంది ఏఆర్‌ఏఎస్‌ఐలు, హెడ్ కానిస్టేబుళ్లు, 1051 మంది సివిల్ పోలీసులు, 258 మంది ఏఆర్ పోలీసులు, 812 మంది హోంగార్డులు, 3 ప్లటూన్ల ఏపీఎస్పీ బలగాలు, 10 కంపెనీల పారా మిలిటరీ బలగాలు, 150 మంది కర్ణాటక పోలీసులు, 410 మంది కర్ణాటక హోంగార్డులు, 372 మంది ఎక్స్ సర్వీసు, ఎన్‌సీసీ, ఎన్‌ఎస్‌ఎస్ సిబ్బంది బందోబసులో పాల్గొంటారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎన్నికల ప్రక్రియను అంతా సీసీ కెమెరాలు, డ్రోన్ కెమెరాలు, వీడియో కెమెరాలతో చిత్రీకరిస్తారు. డ్రోన్ కెమెరాలు, స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్సులు, ఫ్లయింగ్ స్క్వాడ్స్, పోలీసు రూట్ మొబైల్స్‌తో పోలింగ్ కేంద్రాల వద్ద నిరంతర నిఘా ఏర్పాటు చేశారు. పోలింగ్ కేంద్రాలను కమాండ్ కంట్రోల్ ద్వారా పర్యవేక్షిస్తారు.



ఓటెత్తండి..!

- నేతల తలరాతలు మీ చేతుల్లోనే
- నిర్లక్ష్యం వీడి ఓటు వేసేందుకు కదలండి

నంద్యాల, మే 12 (ఆంధ్రజ్యోతి):

● నా పిల్లలు ఇద్దరు సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు. హైదరాబాద్‌లో పని చేస్తారు. ప్రస్తుత ఎన్నికల్లో ఓటేసేందుకు ఇక్కడకు రారు. పంచాయతీ ఎన్నికలైతే ఊరికి సంబంధించిన విషయం కాబట్టి వస్తారు. నియోజక వర్గ ఎన్నికల్లో ఓటేసేందుకు పెద్దగా ఆసక్తి చూపరు

- ఆత్మకూరుకు చెందిన ఓ వృద్ధుడి అభిప్రాయం

● ప్రస్తుతం నాది బీటెక్ పూర్తయింది. ఉద్యోగం కావాలంటే నేను వెతుక్కోవాల్సిందే కానీ, ప్రభుత్వం నాకు ఉద్యోగం వచ్చేలా చేస్తుందా? మన ఇబ్బందులు, సమస్యలు మనం పరిష్కరించుకోవాల్సిందే! ఎవరూ మన గురించి పట్టించుకోరు. మొదటిసారి ఓటు హక్కు వచ్చినా ఓటేసే ఉద్దేశం లేదు

- నంద్యాలకు చెందిన ఓ యువతి మనోగతం

ప్రజలకు మేలు చేసే చట్టం తీసుకురావాలన్నా, రూపుమాపాలన్నా ఓటు ద్వారానే సాధ్యమవుతుంది. వీటికి ప్రాతినిధ్యం వహించే వారిని మనమే ఎన్నుకోవాల్సి ఉంటుంది. అంటే పరోక్షంగా మనకు మేలు జరగాలన్నా, మన సమస్యలకు పరిష్కారం కావాలన్నా మనం ఎన్నుకునే నాయకుల ద్వారానే జరుగుతుంది. అలాంటిది ఎవరూ గెలిచినా మనకు ఏం ఒరుగుతుందనే అభిప్రాయం సరైనది కాదు. నిన్నటి తరం వారిలో చదువు లేకపోవడంతో శాసన, పార్లమెంటు వ్యవస్థలు ఎలా పని చేస్తాయో తెలియదనుకోవచ్చు. కానీ చదువుకున్న నేటి తరం యువత కూడా ప్రజాస్వామ్య వ్యవస్థపై అవగాహన లేకుండా మాట్లాడటం పూర్తిగా చింతించాల్సిన విషయం. యువత ఓటు వేసే రోజును ఓ సెలవు దినంగా చూడకుండా మన భవిష్యత్తును నిర్ణయించే కీలక ఘట్టంగా భావించి ఓటేసేందుకు అడుగు వేయాలి.

● ఓటుదే పవర్..

ఎన్నికల్లో ఓటేయలేదంటే ఐదేళ్ల పాటు ప్రశ్నించే హక్కును కోల్పోతారు. ఆ వ్యక్తి అవినీతి పరుడని విమర్శించే హక్కును కోల్పోవడమే కాకుండా, విమర్శించే అవకాశాన్ని కూడా కోల్పోతారు. రోడ్లు బాగాలేవని, గుంతలు పడ్డాయని, మంచినీళ్లు రావడం లేదని, విద్యుత్ సరఫరా సక్రమంగా లేదని, లంచాలు పెరిగిపోయాయని ఫిర్యాదు చేసే అవకాశం కూడా ఉండదు. బాధ్యత లేని వారికి ప్రశ్నించే హక్కు ఉండదన్న విషయం గుర్తుంచుకుని ఓటు వేయాలి. ఇక ప్రజాస్వామ్యంలో మనం ఉన్నామంటే.. స్పందిస్తున్నామంటే.. వ్యతిరేకిస్తున్నామంటే అది ఓటుతోనే సాధ్యమవుతుంది. పాఠశాలకు, కళాశాలకు వెళ్లే విద్యార్థికి హాజరు, ఆఫీసుకు వెళ్లే ఉద్యోగికి రిజిస్టర్‌లో సంతకం వంటివి వరి ఉనికిని తెలియజేస్తాయి. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు వేస్తేనే ప్రతి పౌరునికి ఉనికి. అందుకే ఓటేసేందుకు యువత కదలాలి.

● ఓటింగ్‌పై అవగాహన కార్యక్రమాలు పెంచినా..

ప్రపంచీకరణ పెరిగిన తర్వాత యువతకు ఉద్యోగాలు ఎక్కువయ్యాయి. దీంతో ఎక్కడెక్కడో ఉంటూ విధులు నిర్వహిస్తున్నారు. ఉద్యోగం ఇచ్చిన భద్రతతో యువత మిగతా వాటి గురించి పట్టించుకోవడం మానేసింది. ఇక ఎన్నికలు, ప్రజాస్వామ్యం వారికి అవసరం లేనివిగా తోస్తున్నాయి. ఇక ప్రస్తుత రాజకీయ నాయకులను చూసి కూడా యువత ఎన్నికలను ఏవగించుకుంటున్నారు. దీంతో ఓటు విషయంలో పూర్తి నిర్లిప్తత ప్రదర్శిస్తున్నారు. గత ఎన్నికల్లో పోలింగ్ సరళిని బట్టి విశ్లేషకుల అభిప్రాయం. ఇదే యువత దేశభక్తికి సంబంధించిన నినాదాలు రాసిన టీ షర్టులు వేసుకుంటూ, బైకులపై రాసుకుంటూ తిరుగుతుంటారు. కానీ ఓటు హక్కును వినియోగించుకునేందుకు మాత్రం రారన్న అభిప్రాయం బలంగా వినిపిస్తోంది. దీనిని గమనించిన ప్రభుత్వాలు ఓటు విలువ తెలియజేసేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోంది. కళాశాలలు, ప్రధాన కూడళ్లలో ఓటేయాలంటూ ప్రచారాన్ని అధికారులు నిర్వహించారు. అయినా 20 నుంచి 30 ఏళ్లలోపు వారు ఓటేసేందుకు ఆసక్తి చూపడం లేదు.

● ఓటు ఎందుకు వేయాలంటే..

మనది ప్రజాస్వామ్య దేశం. ఇక్కడ ప్రతి చట్టం శాసనం ద్వారా చేయాల్సి ఉంటుంది. అంతెందుకు ఓ గ్రామం అభివృద్ధి కావాలన్నా, నియోజకవర్గం అన్ని రకాలుగా ముందుకు పోవాలన్నా మనం పాలించే నేతలు సరైన వారై ఉండాలి. సమర్థవంతమైన ప్రభుత్వం అధికారంలో ఉండాలి. 1947లో ఒకేసారి స్వాతంత్రం పొందిన పొరుగు దేశం, మన దేశం పరిస్థితిని చూసుకుంటే ఏది అభివృద్ధిలో దూసుకుపోతోంది, ఏది వెనుకబడి ఉందనే విషయం అందరికీ తెలిసిన విషయమే! దానికి కారణం మనదేశంలో సమర్థవంతమైన ప్రభుత్వాలు ఉండటమే కారణం. సమర్థవంతమైన ప్రభుత్వం కావాలంటే ప్రతి ఒక్కరూ ఓటు వేసి సరైన నాయకుడిని ఎన్నుకోవాలి. ప్రజాస్వామ్య దేశంలో పుట్టిన ప్రతి ఒక్కరి బాధ్యత ఓటేయడం. ఒకరిని ఓడించడానికో.. ఒకరిని గద్దె దించడానికో కాదు ఎన్నికలంటే.. ప్రజలంతా భాగస్వాములు కావాల్సిన ప్రజాస్వామ్య యజ్ఞం! అందుకే యువత ఎన్నికలు వేసేందుకు పోటెత్తి తమ భవిష్యత్తును తామే నిర్ణయించుకోవాలి!



మోడల్ పోలింగ్ స్టేషన్ ఆత్మకూరు పట్టణం ఇస్లాంపేటలోని 80వ పోలింగ్ బూత్

● మంచి అభ్యర్థిని ఎన్నుకో..

ఒకపుడు ఎన్నికలు అంటే నాయకుడి సామర్థ్యాలు ఏపాటివి, మంచివాడా? చెడ్డవాడా? అనేది కీలకంగా ఉండేది. కానీ ప్రస్తుత పరిస్థితుల్లో ఓటును నోటు నిర్ణయిస్తోంది. ప్రతి ఓటుకు లెక్కగట్టి నాయకులు డబ్బులు పంచుతున్నారు. అయితే నోటుకు ఆశపడి ఓటును ఎవరికి పడితే వారికి ఓటేయకండి. నోటు ఇచ్చిన నేత ఎన్నికల్లో గెలిచిన తర్వాత సమస్య ఉందని ప్రజలు చెబితే.. 'ఊరికే వేశారా ఓటు? పోండి పోండి' అని గెంటేసే అవకాశం ఉంది. ఇలాంటి వార్తలు తరచూ వార్తల్లో చూస్తూనే ఉన్నాం. కాబట్టి నియోజకవర్గం గురించి అన్ని తెలిసిన వారు, సమస్య ఉందని చెబితే తీర్చేవారు, పిలిస్తే పలికే వారిని చూసి ఓటేయండి. ఆ పార్టీ సిద్ధాంతాలు, మేనిఫెస్టోల ఆధారంగా విశ్లేషించుకుని ఓటు వేయండి. మన సామాజిక వర్గం, మన వాళ్ళకు మంచి చేస్తాడని ఓటు వేస్తే గెలిచాక సదరు నేత తన గేటును కూడా దాటనివ్వడు.



● చాటింగ్ చేసే సమయంలో..

ప్రస్తుత పరిస్థితుల్లో యువత సామాజిక మాధ్యమాల్లో మునిగి తేలుతూ, రీల్స్ వంటివి చూస్తూ గంటల గంటల సమయం వృథా చేస్తున్నారు. అర్ధరాత్రుళ్ళ వరకు చాటింగ్‌లో చేస్తున్నారు. అయితే వీటి వల్ల ఎంత మాత్రం ఉపయోగముందో వారికి కూడా తెలియదు. కానీ ఓటు వల్ల ఓ నియోజకవర్గం, ఓ రాష్ట్రం, దేశం భవిష్యత్తు ఆధారపడి ఉంది. కాబట్టి యువత సామాజిక మాధ్యమాల్లో గడిపే సమయంలో నుంచి పది నిమిషాలు కేటాయిస్తే చాలు ఓటు వేయవచ్చు. ఇక ఉద్యోగాలు చేసే యువత ఓటేసేందుకు కంపెనీలు కూడా సెలవును ప్రకటిస్తాయి. కాబట్టి ఎన్నికల రోజును ఓ సెలవు దినంగా పరిగణించకుండా, ఓటరు కార్డు దొరకలేదని, వచ్చే వీలు లేదని కుంటి సాకులు చెప్పకుండా ఓటు వేసేందుకు తరలి రావాలి. క్యూలో నిలబడి ఓటు వేసి తమ బాధ్యతను నెరవేర్చాలి.

బీప్ సౌండ్ గమనించాలి



నంద్యాల టౌన్, మే 12 : పోలింగ్ రోజున ఓటు వేయడానికి వెళ్లిన ఓటర్లంతా అత్యంత జాగ్రత్తగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలి. పోలింగ్ బూత్‌లో ఓటర్లు ఈవీఎం బటన్ నొక్కిన తరువాత తప్పని సరిగా బీప్ సౌండ్ గమనించాలి. బీప్ శబ్దం రాకుంటే ఓటు దుర్వినియోగమైనట్లు భావించవచ్చు. ఓటర్లు ఈవీఎం శబ్ధంపై దృష్టి కేంద్రీకరించి అనుమానం ఉంటే అధికారుల దృష్టికి తీసుకెళ్లాలి. ఈవీఎంలో నచ్చిన అభ్యర్థికి ఓటు వేసిన సమయంలో పేరు, ఎన్నికల గుర్తు పక్కనే ఉన్న బటన్ నొక్కినప్పుడు శబ్ధం వస్తుంది. వెంటనే పక్కనే ఉన్న వీవీప్యాట్‌లో ఓటు వేసిన అభ్యర్థి పేరు, పార్టీ వివరాలు డిస్‌ప్లే అవుతాయి. బటన్ నొక్కినప్పుడు బీప్ శబ్దం రాకపోతే ఓటు పడలేదని అర్థం. ఎన్నికల విధుల్లో ఈవీఎం మానిటర్ కంట్రోల్ యూనిట్ యాక్టివేట్ చేయాల్సిన అధికారి యాక్టివేట్ చేయలేదన్న విషయాన్ని అక్కడే గుర్తించాలి. వెంటనే ప్రశ్నించాలి. గమనించకుండా పోలింగ్ బూత్ నుంచి బయటకు వెళ్లిపోతే ఆ తరువాత బూత్‌లో ఉన్న వారు మన ఓటును వారికి నచ్చిన వారికి వేసుకోవడం రిగ్గింగ్‌లో భాగమేనన్న విషయాన్ని తెలుసుకోవాలి. ఓటు వేయడం మన హక్కు. దీన్ని జాగ్రత్తగా వినియోగించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉంది. ఏమైనా తేడా గుర్తిస్తే మాక్ పోల్ స్లిప్ ద్వారా ఫిర్యాదు నమోదు చేయాలి.

వలంటీర్ల సాక్షిగా ఓటుకు నోటు



బహిరంగంగా ఓటర్లకు డబ్బులు పంపిణీ చేస్తున్న వైసీపీ కౌన్సిలర్

ఆదోని రూరల్, మే 12 : బహిరంగంగా వలంటీర్ల సాక్షిగా ఓటర్లకు డబ్బు పంపిణీ చేస్తున్నా, ఎన్నికల అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించారు.






సాయిప్రసాద్ రెడ్డి ఫొటోతో కూడిన ఓటరు స్లిప్పులు

ఆరేకల్లులో వలంటీర్లు, వైసీపీ నాయకులు ఓటర్లకు డబ్బులు పంపిణీ చేయడంతోపాటు వైసీపీ అభ్యర్థులైన సీఎం జగన్, సాయిప్రసాద్‌రెడ్డి చిత్రాలతో ఉన్న ఓటరు స్లిప్పులను బహిరంగంగా పంపిణీ చేశారు. వీరిపై చర్యలు తీసుకోవాలని కూటమి నాయకులు డిమాండ్ చేశారు. కొందరు పోలీసులు, ఎన్నికల అధికారులు వైసీపీకి కొమ్ము కాస్తుండడంతోనే వైసీపీ నాయకులు ఆడిందే ఆట, పాడిందే పాటగా మారిందని కూటమి నాయకులు ఆరోపిస్తున్నారు.

ఓటరు నాడి ఎటు వైపో..?



నంద్యాల, మే 12 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల సమరం - 2024 చివరి అంకానికి చేరుకుంది. సోమవారం పోలింగ్ జరగనుంది. ఎన్నికల షెడ్యూలు మొదలైనప్పటి నుంచి విజయమే లక్ష్యంగా నేతలు ప్రచారం నిర్వహించారు. సోమవారం జరగనున్న ఎన్నికలపై అంచనాలు వేసుకుంటున్నారు. ఓటరు నాడి ఎటు వైపు ఉండబోతుందోనన్న చర్చల్లో మునిగి తేలుతున్నారు. గెలుపుపై ఎవరికి వారు ధీమాగా ఉన్నారు. ఈ క్రమంలో పోలింగ్ బూత్ ఏజెంట్లను అప్రమత్తంగా ఉండాలని ఆయా పార్టీల నేతలు హెచ్చరిస్తున్నారు. ఇక పోలింగ్ సమయం కావడంతో పార్టీల నాయకులు ఓటర్లకు తాయిలాలు పంపిణీని ముమ్మరం చేసి పోటాపోటీగా పంపకాలు చేస్తున్నారు. ఇక దీనికి తోడు మద్యం ప్రియులకు భారీగానే మందు బాటిళ్ల పంపకాలు కూడా జరిగాయని సమాచారం. మొత్తంగా అన్ని నియోజకవర్గాల్లో రూ.450 కోట్లకు పైగా నగదు ప్రత్యక్షంగా ఓటర్లకు పంపిణీ జరిగిందని, మద్యం, రోజూవారీ ప్రచార ఖర్చులు గ్రామాల్లో ప్రచారానికి వచ్చే వారికి ఇచ్చే సొమ్ములన్నీ కలిపి మరో రూ.200 కోట్ల వరకు ఖర్చయి ఉంటుందని అంచనా. జిల్లాలోని ఓ పార్టీకి చెందిన వారు ఓటుకు రూ.2 వేలు వరకు పంచగా, మరో పార్టీ నాయకుల్లో కొంత మంది ఇదే తీరుగా రూ.2 వేలు ఇచ్చారు. మరి కొంత మంది రూ.1000 పంచినట్లు తెలుస్తోంది. రిజర్వుడు నియోజకవర్గంలో కూడా ఓ పార్టీ రూ.1500 నుంచి రూ.2 వేలు పంచగా, మరో పార్టీ నేతలు రూ.1000 ఇచ్చినట్లు సమాచారం. ఇక మద్యం షాపుల బంద్ ప్రచారానికే పరిమితమైందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. జిల్లాకు చెందిన వారు ఇతర వివిధ కారణాల రీత్యా ఇతర ప్రాంతాల్లో ఉంటూ ఓటేసేందుకు వస్తున్నారు. అలాంటి వారికి ఆయా పార్టీల నాయకులు టికెట్ ఖర్చులు పెట్టుకుంటున్నట్లు తెలుస్తోంది. ఇతర ప్రాంతాలకు పనుల నిమిత్తం వెళ్లిన వారి ఫోన్ నెంబర్లు సేకరించి ఓటేసేందుకు రావాలని అభ్యర్థిస్తున్నారు.

ఓటర్లకు వెల్‌కమ్

● ఆకట్టుకుంటున్న మోడల్ పోలింగ్ కేంద్రాలు

కర్నూలు నగరంలో ఈ ఏడాది సార్వత్రిక ఎన్నికల్లో పలు పోలింగ్ సెంటర్లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. మోడల్ పోలింగ్ స్టేషన్లలో భాగంగా కర్నూలు నగరంలో ఎంపిక చేసిన కొన్ని పోలింగ్ కేంద్రాలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. యువత, మహిళలు, దివ్యాంగుల కోసం ఈ కేంద్రాలను ఏర్పాటు చేశారు. మోడల్ పోలింగ్ స్టేషన్లలో భాగంగా ఇందిరాగాంధీ మెమోరియల్ మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్‌లోని పోలింగ్ కేంద్రాన్ని సర్వాంగ సుందరంగా అలంకరించారు. అదేవిధంగా యువతను ఆకట్టుకునేందుకు ఎ.క్యాంప్‌లోని మాంటిస్సోరి ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో యూత్ పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఇక దివ్యాంగులు ఇబ్బందులు పడకుండా వారి కోసం ఎస్‌ఏపీ క్యాంప్‌లోని సీఆర్ఆర్ఎంఎం పాఠశాలలో ఓ పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు.

- కర్నూలు, కలెక్టరేట్



దివ్యాంగుల ఆదర్శ పోలింగ్ స్టేషన్ : సీఆర్ఆర్ఎంసీహెచ్ పాఠశాల, ఎస్ఏపీ క్యాంప్, కర్నూలు





యూత్ పోలింగ్ స్టేషన్ : మాంటిస్సోరి ఇంగ్లీష్ మీడియం పాఠశాల, నర్సరీ బ్లాక్, ఎ. క్యాంపు, కర్నూలు





మోడల్ పోలింగ్ స్టేషన్ : ఇందిరాగాంధీ మెమోరియల్ మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్, కర్నూలు




నా ఓటు..

- ఈ ఎన్నికల్లో ఓటరు తీర్పు సుస్పష్టం
- పార్టీ అభ్యర్థులపై కచ్చితమైన వైఖరి
- ఎవరికి ఓటు వేయాలో నిర్ణయించుకున్న ఓటరు
- పోలింగ్‌కు ముందే తేలుతున్న అభ్యర్థుల భవితవ్యం



సార్వత్రిక ఎన్నికల్లో ఏ పార్టీకి ఓటెయ్యాలి.. ఏ అభ్యర్థిని అసెంబ్లీకి, పార్లమెంటుకు పంపాలి.. ఈ అంశాలపై ఇప్పటికే ఓటర్లు స్పష్టమైన నిర్ణయానికి వచ్చేసినట్టు తెలుస్తోంది. ఫలానా అభ్యర్థికే తమ ఓటు అంటూ బహిరంగంగానే చెబుతున్నారు. ఇంతకాలం నిశ్శబ్దంగా ఉన్న ఓటర్లు.. ఇప్పుడు గొంతెత్తి తమ అభిప్రాయాన్ని చాటుతున్నారు.. ఏ నియోజకవర్గంలో ఎవరు గెలుస్తారు.. ఎవరు ఓడిపోతారు.. రాష్ట్రంలో ఏ పార్టీకి గెలిచే అవకాశాలున్నాయి.. ఏ పార్టీ ఓడిపోతుంది.. అనే అంశాలపై విశ్లేషిస్తున్నారు. సహజంగా కౌంటింగ్ ముగిసిన తర్వాత అభ్యర్థుల భవితవ్యం తేలుతుంది. ప్రస్తుతం జరుగుతున్న ఎన్నికల్లో ఓటర్లు రూటు మార్చి బరిలో ఉన్న అభ్యర్థుల భవితవ్యాన్ని ముందే తేల్చేస్తున్నారు.

కర్నూలు, మే 12 (ఆంధ్రజ్యోతి):



అభివృద్ధిపైనే ఓటరు దృష్టి


● రాష్ట్ర విభజన తర్వాత ఆవిర్భవించినా నవ్యాంధ్ర తొలిసారి ముఖ్యమంత్రిగా చంద్రబాబు బాధ్యతలు చేపట్టారు. కర్నూలు జిల్లాలో ముచ్చుమర్రి లిఫ్ట్ పూర్తి చేశారు. రూ.1,350 కోట్లతో హంద్రీనీవా విస్తరణకు శ్రీకారం చుట్టారు. ఆర్డీఎస్ కుడి కాలువ, వేదవతి ప్రాజెక్టు, గుండ్రేవుల జలాశయం ప్రాజెక్టులకు రూ.8,500 కోట్లు మంజూరు చేశారు. ఆర్డీఎస్, వేదవతి ప్రాజెక్టు పూర్తి పనులు మొదలు పెట్టారు. ఓర్వకల్లు మండలంలో ఆసియాలోనే అతిపెద్ద సోలార్ పార్క్, దేశంలోనే ప్రథమంగా పంప్ స్టోరేజ్ పవర్ ప్రాజెక్టు తీసుకొచ్చారు. 33 వేల ఎకరాల్లో ఓర్వకల్లు పారిశ్రామివాడ ఏర్పాటు చేశారు. ట్రిపుల్ ఐటీ కాలేజీ, స్టేట్ క్యాన్సర్ యూనిట్ తెచ్చారు. ఓర్వకల్లు విమానాశ్రయం నిర్మించారు. ఇలా ఎన్నో కందనవోలు అభివృద్ధికి బీజం వేశారు. అయితే.. ఒక్క చాన్స్ అంటూ జగన్ మాటలు విశ్వసించి 2019లో అధికారం ఇచ్చారు. సంక్షేమ ముసుగులో అభివృద్ధికి పాతర వేశారు. దీంతో ప్రభుత్వంపైన, స్థానిక ఎమ్మెల్యేలపైన ప్రజల్లో అసంతృప్తి గూడు కట్టుకుంది.



అసంపూర్తిగా ఆగిన వేదావతి ప్రాజెక్టు స్టేజ్-2 పంపింగ్ పనులు



ఓర్వకల్లు వద్ద సోలార్ పార్క్



గుండ్రేవుల జలాశయం నిర్మించే తుంగభద్ర నది ప్రాంతం

ఆయా వర్గాల మనసులో మాట



● కర్నూలు నగరం వెంకటరమణ కాలనీకి చెందిన ఓ యువకుడిని పలకరిస్తే 'మూడేళ్ల క్రితం బీటెక్ పూర్తి చేశాను. పై చదువులకు వెళ్దామంటే ఆర్థిక స్థోమత లేదు. ప్రభుత్వం ఉద్యోగం కోసం ప్రయత్నం చేద్దామంటే ఒక్క జాబ్ క్యాలెండర్ ఇవ్వలేదు. అమ్మానాన్నలపై ఆధారపడాల్సి వస్తోంది. నాలాంటి నిరుద్యోగులు వేలల్లో ఉన్నారు. మాకు జాబ్ క్యాలెండర్ ఇచ్చే వారికి మా ఓటు' అని చెప్పుకొచ్చారు. బీఈడీ చేసిన మరో నిరుద్యోగ ఉపాధ్యాయుడిని పలకరిస్తే 'ఐదేళ్లలో ఒక్కటంటే ఒక్క డీఎస్సీ ఇవ్వలేదు. డీఎస్సీ ఇస్తామని స్పష్టం చెప్పే పార్టీకే మా ఓటు అంటున్నారు.' మెజారిటీ నిరుద్యోగ యువతదీ ఇదే పరిస్థితి. ఏ పార్టీకి.. ఏ అభ్యర్థికి ఓటు వేయాలో ఓ నిర్ణయానికి వచ్చేశారు.



ఓర్వకల్లు విమానాశ్రయం

● కోడుమూరు నియోజకవర్గానికి చెందిన అధికార పార్టీకి చెందిన సర్పంచ్ ఒకరు మాట్లాడుతూ జనరల్, ఆ తర్వాత బీసీ రిజర్వేషన్‌లో రెండు పర్యాయాలుగా నేను సర్పంచ్‌గా పని చేస్తున్నాను. గతంలో ఏ ప్రభుత్వం కూడా పంచాయతీ నిధులు వాడుకోలేదు. జగన్ ప్రభుత్వం రాష్ట్రంలో పంచాయతీలకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన 14, 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.8,600 కోట్లు లాగేసుకుంది. పంచాయతీలను నిర్వీర్యం చేసింది. మా పంచాయతీకి వచ్చిన రూ.25 లక్షలకు ఆర్థిక సంఘం నిధులను రాష్ట్ర ప్రభుత్వం తీసుకోవడంతోపాటు వీధి దీపాలు, పారిశుధ్యం, తాగునీటి నిర్వహణ కోసం అప్పులు చేయాల్సి దైన్యపరిస్థితి ఏర్పడింది. మా నిధులు మాకు ఇస్తామంటున్న పార్టీకే సర్పంచుల మద్దతు ఉంటుంది. ఇన్నాళ్లూ మమ్మల్ని ఇబ్బందులు పెట్టే పార్టీకి ఓట్లు ఎలా వేస్తాం అంటూ తన మనసులోని మాటను వెల్లడించారు.

● మంత్రాలయం నియోజకవర్గం కోసిగికి చెందిన ఓ రైతును పలకరిస్తే.. ఐదేళ్లుగా వ్యవసాయ రంగం తీవ్రంగా దెబ్బతింది. రైతులు వలసలు వెళ్లాల్సిన దుర్భర పరిస్థితి వచ్చింది. రైతులు వ్యవసాయ కూలీలు, కౌలు రైతులను ఈ ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. రైతు భరోసా కింద కేంద్రం సాయంతో కలిపి రూ.13,500 మూడు విడతలుగా అకౌంటులో వేసి.. ఆపై ఎరువులు, డీజిల్ ధరలు పెంచి వ్యవసాయ భారంగా మార్చేశారు. ఉచిత హామీలు కాకుండా, పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలని.. కేంద్ర ప్రభుత్వం మద్దతు ధరను పెంచాలి.. మద్దతు ధర లేనప్పుడు రాష్ట్ర ప్రభుత్వం బోనస్ ఇస్తూ పంట ఉత్పత్తులు కొనుగోలు చేయాలనే అభిప్రాయం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా తెచ్చిన ల్యాండ్ టైటిలింగ్ యాక్టు వల్ల మా భూములకు భద్రత లేకుండా పోతుంది.. ఎవరు కబ్జా చేస్తారో అనే భయం వెంటాడుతోంది. రైతులకు భద్రత కల్పించే పార్టీకే మా ఓటు అని వెల్లడించాడు. టీడీపీ కూటమి ప్రభుత్వం రాగానే ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు చేస్తూ రెండో సంతకం చేస్తామని టీడీపీ అధినేత చంద్రబాబు స్పష్టమైన హామీ ఇచ్చారు.



● ఎమ్మిగనూరు మండలం కలుగొట్ల గ్రామంలో ఓ రైతును పలకరిస్తే.. 'ఆర్డీఎస్ కుడి కాలువ వస్తే మా ఊరికి సాగునీరు వస్తుందని ఆశించాం. ఆ ప్రాజెక్టు ఆగిపోయింది. ఎన్టీఆర్ వచ్చాక వ్యవసాయ విద్యుత్ మీటర్లు తీసేశారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి వచ్చాక ఉచిత విద్యుత్ ఇచ్చాడు. ఆ తర్వాత వచ్చిన ప్రభుత్వాలు ఉచిత విద్యుత్ అమలు చేస్తూ వచ్చాయి. ప్రస్తుత వైసీపీ ప్రభుత్వం వ్యవసాయం పంపుసెట్లకు మీటర్లు ఏర్పాటు చేస్తోంది. ఇది రైతుకు గుదిబండ కానుంది.. పంటకు గిట్టుబాటు ధర లేదు. రైతులకు మేలు చేసే ప్రభుత్వం రావాలని కోరుతున్నాం' అని ఆ రైతు వెల్లడించాడు.





ముచ్చుమర్రి ఎత్తిపోత పథకం

వేళ్లపై ఇతర సిరా మార్కు వేస్తే చర్యలు



కర్నూలు(కలెక్టరేట్), మే 12: ఇతర సిరా ద్వారా ఓటర్ల వేళ్లపై మార్కు వేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా.జి. సృజన తెలియజేశారు. ఓటర్ల వేళ్లపై ఇంటి వద్దే మార్కు చేస్తూ ఓటు హక్కును వినియోగించుకోకుండా చూడాలనే కుట్ర జరుగుతున్నదంటూ సోషల్ మీడియాలో అవుతున్న దుష్ప్రచారాన్ని ఖండించారు. చెరగని సిరా ప్రభుత్వం మాత్రమే తయారు చేస్తోందని తెలిపారు. ఈ సిరా భారత ఎన్నికల సంఘం వద్ద మాత్రమే అందుబాటులో ఉంటుందన్నారు. ఈ సిరా భారతీయ ఎన్నికల సంఘం వద్ద కాకుండా ఇతరులు ఎవరికైనా అందుబాటులో ఉంటుందనే తప్పుడు ప్రచారం అన్నారు. ఎవరైనా ఇతర సిరాల ద్వారా చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు.

స్వేచ్ఛగా, నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలి: కలెక్టర్

కర్నూలు(కలెక్టరేట్), మే 12: ప్రజలు స్వేచ్ఛగా, నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా.జి.సృజన ఆదివారం తెలిపారు. పోలింగ్ కేంద్రాల వద్ద ప్రజలకు ఇబ్బంది లేకుండా అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. తాగునీరు, షెడ్స్, వికలాంగుల కోసం ర్యాంపులు ఏర్పాటు చేశామని తెలిపారు. పోలింగ్ కేంద్రాలకు వచ్చే వృద్ధులు, వికలాంగులు, గర్భిణులుగా ఉన్న ఓటర్లకు తగిన సహకారం అందించేందుకు ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ, స్కౌట్స్ అండ్ గైడ్స్ విభాగాలకు చెందిన సహాయకులను ఏర్పాటు చేశామన్నారు. వికలాంగుల కోసం ప్రతి పోలింగ్ స్టేషన్‌లో వీల్ చైర్స్ ఏర్పాటు చేశామని తెలిపారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో పోలీసు బలగాల ద్వారా భద్రత కల్పించామని చెప్పారు. పోలింగ్ రోజు వర్షం వచ్చే అవకాశం ఉన్నందున ప్రజలు వీలైనంత త్వరగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును వినియోగించుకోవడం ప్రజలందరి బాధ్యత అన్నారు.



రిపోర్టు చేయని వారిని సస్పెండ్ చేయండి

కర్నూలు(కలెక్టరేట్), మే 12: ఎన్నికల విధులకు రిపోర్టు చేయని వారిని సస్పెండ్ చేయాలని రిటర్నింగ్ అధికారులను కలెక్టర్ జిల్లా ఎన్నికల అధికారి డా.జి. సృజన ఆదేశించారు. ఆదివారం స్థానిక ఔట్‌డోర్ స్టేడియంలో కర్నూలు నియోజకవర్గానికి సంబంధించిన పోలింగ్ మెటీరియల్ డిస్ట్రిబ్యూషన్ పనులను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 258 పోలింగ్ కేంద్రాలకు గానూ, 21 సెక్టార్లు, 8 కౌంటర్లను ఏర్పాటు చేస్తామని అన్నారు. పోలింగ్ సిబ్బందిని తరలించే రూట్ వాహనాలు సెక్యూరిటీతో వెళ్లే విధంగా చూసుకోవాలని రిటర్నింగ్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో కర్నూలు రిటర్నింగ్ అధికారి, కర్నూలు నగర పాలక సంస్థ మున్సిపల్ కమిషనర్ భార్గవ్‌తేజ తదితరులు పాల్గొన్నారు.



కర్నూలు జిల్లా వ్యాప్తంగా ఓట్ల వివరాలు

కర్నూలు(కలెక్టరేట్), మే 12: కర్నూలు జిల్లాలో మొత్తం 2,204 పోలింగ్ కేంద్రాలు కాగా. పురుషుల ఓటర్లు 10,13,794, మహిళా ఓటర్లు 10,40,451, ఇతరులు 318 మంది ఉన్నారు. మొత్తం 20,54,563 మంది ఓటర్లు ఉన్నారు.

నియోజకవర్గం	పోలింగ్ కేంద్రాలు	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
కర్నూలు	258	1,32,769	1,41,665	31	2,74,465
పత్తికొండ	255	1,11,603	1,11,978	22	2,23,603
కోడుమూరు(ఎస్సీ)	275	1,23,468	1,23,148	16	2,46,632
ఎమ్మిగనూరు	272	1,22,041	1,25,664	47	2,47,752
మంత్రాలయం	237	1,02,155	1,06,172	23	2,08,350
ఆదోని	256	1,30,364	1,32,642	52	2,63,058
ఆలూరు	294	1,30,083	1,28,861	53	2,58,997
పాణ్యం	357	1,61,311	1,70,321	74	3,31,706
మొత్తం	**2204**	**10,13,794**	**10,40,451**	**318**	**20,54,563**

కట్టలు తెగిన కరెన్సీ..!

● ఓటర్లకు డబ్బు వెదజల్లిన పార్టీలు ● కనిష్టంగా రూ.500, గరిష్టంగా రూ.2 వేలు



కర్నూలు, మే 12 (ఆంధ్రజ్యోతి): కరెన్సీ కట్టలు తెగాయి. ఆ పార్టీ.. ఈ పార్టీ అన్న తేడా లేకుండా విచ్చలవిడిగా ఓట్లు లెక్క కట్టి నోట్లు పంపిణీ చేశారు. శని, ఆదివారాల్లో పగలు, రాత్రి అనే తేడా లేకుండా డబ్బు పంపిణీ భారీగా సాగింది. మద్యం, చికెన్ విందులు ఏర్పాటు చేశారు. కనిష్టంగా రూ.500, గరిష్టంగా రూ.2 వేలు పంపిణీ చేశారు. మెజార్టీ నియోజకవర్గాల్లో రూ.వెయ్యి పంపిణీ చేయడం కొసమెరుపు. ఒకటి రెండు నియోజకవర్గాల్లో కీలక వార్డుల్లో గంపగుత్త ఓట్లు వస్తాయనకుంటే రూ.3 వేలు కూడా పంపిణీ చేసినట్లు సమాచారం.

● ఒక్క రోజులో ఓటర్లకు చేరింది రూ.500 కోట్లు పైమాటే: ఒక్కో నియోజకవర్గంలో సగటున 2.50 లక్షల ఓటర్లు ఉన్నారు. మొత్తం ఓటర్లలో 75-80 శాతం లెక్క కట్టి ఓటుకు రూ.వెయ్యి చొప్పున ఇరు పార్టీలు పంపిణీ చేసినట్లు తెలిసింది. ఈ లెక్కన ఒక్కో అభ్యర్థి పోలింగ్ ముందు రోజు దాదాపుగా రూ.17-25 కోట్లకు పైగా డబ్బులు పంచారని విశ్వసనీయ సమాచారం. ఈ లెక్కన ఒక్కో నియోజకవర్గంలో సగటున రూ.35-40 కోట్లకు పైగా ఓటర్లకు చేరిందని అంచనా వేస్తున్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 14 అసెంబ్లీ నియోజకవర్గాల్లో రూ.500 కోట్లకు పైగా డబ్బు వివిధ రూపాల్లో ఓటర్లకు చేరిందని తెలుస్తోంది. రాజకీయ పార్టీలు రూ.వందల కోట్లు విచ్చలవిడిగా పంపిణీ చేస్తుంటే పోలీస్ నిఘా కళ్లకు గంతలు కట్టుకుందా..? అని పలువురు ప్రశ్నిస్తున్నారు.

జిల్లా ఎన్నికల సమాచారం

కర్నూలు(కలెక్టరేట్), మే 12:

- కర్నూలు పార్లమెంటు స్థానం - 01
- అసెంబ్లీ నియోజకవర్గాలు - 08
- కర్నూలు పార్లమెంటు నియోజకవర్గానికి పోటీ చేసే అభ్యర్థులు - 19
- అసెంబ్లీకి పోటీ చేసే అభ్యర్థులు - 102

మొత్తం పోటీ చేసే అభ్యర్థులు - 121

- పోలింగ్ కేంద్రాలు - 2204
- పోలింగ్ లొకేషన్లు - 1096
- కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గానికి పోటీ చేస్తున్న అభ్యర్థులు - 25
- పాణ్యం అసెంబ్లీ నియోజకవర్గానికి పోటీ చేస్తున్న అభ్యర్థులు - 14
- పత్తికొండ అసెంబ్లీ నియోజకవర్గానికి పోటీ చేస్తున్న అభ్యర్థులు - 09
- కోడుమూరు అసెంబ్లీ నియోజకవర్గానికి పోటీ చేస్తున్న అభ్యర్థులు - 14
- ఎమ్మిగనూరు అసెంబ్లీ నియోజకవర్గానికి పోటీ చేస్తున్న అభ్యర్థులు - 10
- మంత్రాలయంలో పోటీ చేస్తున్న అభ్యర్థులు - 8
- ఆదోని అసెంబ్లీకి పోటీ చేస్తున్న అభ్యర్థులు - 10
- ఆలూరులో పోటీ చేస్తున్న అభ్యర్థులు - 12
- పోలింగ్‌కు అవసరమైన సిబ్బంది - 12,714
- అందుబాటులో ఉన్న సిబ్బంది - 14,561
- పీవోలు, ఏపీవోల నియామకం - 4,827
- ఓపీవోల నియామకం - 8,974
- మైక్రో అబ్జర్వర్లు నియామకం - 340
- సెక్టోరల్ ఆఫీసర్లు నియామకం - 232

పార్లమెంటు నియోజకవర్గ స్థాయిలో
- బ్యాలెట్ యూనిట్లు - 4,366
- కంట్రోల్ యూనిట్లు - 2,203
- వీవీ ప్యాట్లు - 2,346

అసెంబ్లీ నియోజకవర్గ స్థాయిలో
- బ్యాలెట్ యూనిట్లు - 2,912
- కంట్రోల్ యూనిట్లు - 2,629
- వీవీ ప్యాట్లు - 2,801
- వెబ్ కాస్టింగ్ - 2,204
- పంపిణీ కేంద్రాలు - 08





ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలి: ఆర్వో


ఎన్నికల సిబ్బందికి సూచనలిస్తున్న ఆర్‌ఓ ఎ. భార్గవతేజ

కర్నూలు(న్యూసిటీ), మే 12: ప్రతి ఒక్కరూ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని రిటర్నింగ్ అధికారి ఎ.భార్గవతేజ తెలిపారు. ఆదివారం ఔట్‌డోర్ స్టేడియంలో ఎన్నికల సామగ్రి పంపిణీ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సిబ్బందికి కావాల్సిన అన్ని రకాల సామగ్రిని పంపిణీ చేస్తున్నామన్నారు. 258 పోలింగ్ కేంద్రాలలో అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. కేంద్రాలలో ఏవైనా వసతులు తక్కువగా ఉంటే వెంటనే సెక్టోరియల్ అధికారికి సమాచారం ఇవ్వాలని ఆయన సూచించారు. వృద్ధులు, దివ్యాంగుల కోసం ప్రత్యేకంగా క్యూలైన్ ఏర్పాటు చేశామన్నారు.

నర్సులు సేవామూర్తులు


ఫ్లోరెన్స్ నైటింగేల్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న నర్సింగ్ సూపరింటెండెంట్ గ్రేడ్-1 సావిత్రీబాయి

కర్నూలు(హాస్పిటల్), మే 12: నర్సులు సేవా మూర్తులని కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల నర్సింగ్ సూపరింటెండెంట్ (గ్రేడ్-1) సావిత్రీబాయి అన్నారు. అంతర్జాతీయ నర్సుల దినోత్సవాన్ని పురస్క రించుకకుని నర్సింగ్ ఆఫీసులో సూపరింటెండెంట్ గ్రేడ్-2 నాగమణితో కలిసి ఆమె ఫ్లోరెన్స్ నైటింగేల్ చిత్రపటానికి పూలమాల వేసి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా నర్సింగ్ సూపరింటెండెంట్ సావిత్రీబాయి మాట్లాడుతూ ఫ్లోరెన్స్ నైటింగేల్‌ను ఆదర్శంగా తీసుకుని నర్సులు ముందుకు సాగాలని కోరారు. రోగి ఆసుపత్రికి వచ్చిన దగ్గర నుంచి కోలుకుని ఇంటికి వెళ్లే వరకు నర్సులు ఎంతో కీలక పాత్ర వహిస్తారన్నారు. కార్యక్రమంలో స్టేట్ క్యాన్సర్ హాస్పిటల్ గ్రేడ్-2 నర్సింగ్ సూపరింటెండెంట్లు అనుసూయ, రాజ్యలక్ష్మి, హెడ్ నర్సులు, స్టాఫ్ నర్సులు, మంజులాదేవి పాల్గొన్నారు.

● అమ్మ వృద్ధుల శరణాలయంలో అన్నదానం: మద్దూరు నగర్‌లోని అమ్మ వృద్ధుల శరణాలయంలో వరల్డ్ నర్సెస్ డేను పురస్కరించుకుని నర్సులు వృద్ధులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో క్యాన్సర్ హాస్పిటల్ నర్సింగ్ సూపరింటెండెంట్ (గ్రేడ్-2) అనుసూయ, ఏపీ గవర్నమెంట్ నర్సెస్ అసోసియేషన్ రాష్ట్ర నాయకురాలు డి.మంజులాదేవి, హెడ్ నర్సులు విమలమ్మ, ఆదిలక్ష్మి, విజయమ్మ, స్టాఫ్ నర్సులు పాల్గొన్నారు.

ఓటు హక్కును వినియోగించుకోవాలి


మాట్లాడుతున్న కే బాబురావు

కర్నూలు(అర్బన్), మే 12: ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు కే బాబురావు అన్నారు. ఆదివారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కర్నూలు అసెంబ్లీ అభ్యర్థి షేక్ జిలాని బాషా, ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడు బీ బతుకన్నలతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 13న జిల్లాలో జరిగే పోలింగ్ ఏర్పాట్లపై ఎన్నికల కమిషన్, కలెక్టర్, ఎస్పీలకు కృతజ్ఞతలు తెలిపారు.ఓటు హక్కును సద్వినియోగం చేసుకునేందుకు వికలాంగులు, వృద్ధులు, గర్భిణులకు ప్రత్యేక వసతులు కల్పించాలని కోరారు. అలాగే సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలని కోరారు. కొన్ని పార్టీలు డబ్బులకు ప్రలోభాలు పెడుతున్నాయని అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ సమావేశంలో అనంత రత్నం మాదిగ, లాజరస్, అమనుల్లా, షేక్ ఖాజా హుస్సేన్ పాల్గొన్నారు.

పోలింగ్‌కు సర్వం సిద్ధం

● కేంద్రాలకు ఎన్నికల సామగ్రి ● తరలిన ఉద్యోగులు, సిబ్బంది
● 258 పోలింగ్ కేంద్రాలు, 2,74,465 మంది ఓటర్లు


ఎస్టీబీసీ కళాశాల పోలింగ్ కేంద్రం 40లో పోలింగ్‌కు సిద్ధం చేసుకుంటున్న సిబ్బంది


తమకు కేటాయించిన కేంద్రాలను బోర్డులో చూసుకుంటున్న సిబ్బంది





కర్నూలు(న్యూసిటీ), మే 12: సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌కు అధికారులు సర్వం సిద్ధం చేశారు. ఆదివారం .కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి ఎన్నికల సామగ్రి అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది తీసుకెళ్లారు. సోమవారం జరిగే పోలింగ్ ప్రక్రియ కోసం బూత్‌లకు ఎన్నికల సామగ్రిని పంపిణీ కేంద్రాన్ని ఔట్‌డోర్ స్టేడియంలో ఏర్పాటు చేశారు. రిటర్నింగ్ అధికారి ఎ.భార్గవతేజ పర్యవేక్షణలో 8 కౌంటర్లు ఏర్పాటు చేసి 258 పోలింగ్ బూత్‌లను 21 సెక్టార్లుగా విభజించారు. కౌంటర్- 1లో మూడు సెక్టర్లకు 1 నుంచి 34 కేంద్రాలు, కౌంటర్-2లో మూడు సెక్టర్లకు 35 నుంచి 63 పోలింగ్ కేంద్రాలు, కౌంటర్-3లో రెండు సెక్టార్లకు 64 నుంచి 96 పోలింగ్ కేంద్రాలు, కౌంటర్-4లో రెండు సెక్టార్లకు 97 నుంచి 124 పోలింగ్ కేంద్రాలు, కౌంటర్-5లో రెండు సెక్టార్లకు 125 నుంచి 156, కౌంటర్-6లో మూడు సెక్టార్లకు 157 నుంచి 192 పోలింగ్ కేంద్రాలు, కౌంటర్-7లో మూడు సెక్టార్లకు 193 నుంచి 226 పోలింగ్ కేంద్రాలు, కౌంటర్-8లో మూడు సెక్టార్లకు 227 నుంచి 258 పోలింగ్ కేంద్రాలకు సంబంధించి ఎన్నికల సామగ్రిని పంపిణీ చేశారు. మరో మూడు కౌంటర్లలో పీఓ, ఏపీఓ, ఇతర పీఓలు, పోలీస్ పర్సనల్ అండ్ మైక్రో అబ్జర్వర్స్‌ను రిజర్వ్‌గా ఉంచారు. పీఓలు, ఏపీఓలు, ఇతర ఓపీలు రాకపోతే వారి స్థానంలో రిజర్వ్‌లో ఉండే వారిని విధులకు కేటాయించారు. అసెంబ్లీకి 258, పార్లమెంటుకు 258 ఈవీఎంలు కేటాయించారు. అలాగే శిక్షణ పొందిన 258 పీఓలు, 258 మంది ఏపీఓలు, 1032 మంది ఓపీఓలు పోలింగ్ రోజు విధులు నిర్వహించనున్నారు. పోలింగ్ సిబ్బందితో పాటు సెక్టోరల్ అధికా రులు, పోలీసు సిబ్బంది, బూత్‌లెవెల్ ఆఫీసర్లు పోలింగ్ కేంద్రాలకు వెళ్లారు.

మధ్యాహ్నం 3 గంటలకు తరలిన సిబ్బంది

ఉదయం 6 గంటలకే ఔట్‌డోర్ స్టేడియంలో రిపోర్టు చేయాలని అధికారులు ఆదేశించారు. అయితే సుదూర ప్రాంతాల నుంచి ఎంతో వ్యయ ప్రయాసలతో వచ్చిన సిబ్బంది పంపిణీ కేంద్రం వద్ద తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మధ్యాహ్నం 12 గంటలలోపు పంపిణీ అవ్వగానే పోలింగ్ కేంద్రాలకు వెళ్లి సేద తీరవచ్చని సిబ్బంది అనుకున్నారు. అయితే రిటర్నింగ్ అధికారి ప్రతి అరగంటకు ఒక్కసారి సెక్టోరియల్ అధికారులకు త్వరగా ఈవీఎంల సామగ్రిని తీసుకెళ్లేందుకు పీఓను సమాయత్తం చేయాలని చెబుతూనే ఉన్నారు. సెక్టోరియల్ అధికారులు, పీఓల అల సత్వం వల్ల మధ్యాహ్నం 3 గంటలకు ఎన్నికల సిబ్బంది సామగ్రిని తీసుకుని పోలింగ్ కేంద్రాలకు బయలు దేరారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటంతో ఎన్నికల సిబ్బంది ఉక్కపోతతో అల్లాడిపోయారు.

గర్భిణులు, చిన్నారుల తల్లులకు వెసులుబాటు..

ఎన్నికల విధులకు హాజరైన గర్భిణులు, చిన్నారుల తల్లులకు ఆర్‌ఓ వెసులుబాటు కల్పించారు. విన్నవించిన వారికి వారి స్థానంలో రిజర్వ్‌గా ఉండే సిబ్బందిని కేటాయించారు. అయితే కొందరు గర్భిణులు, చిన్నారుల తల్లులు కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి జి.సృజన దృష్టికి తమ సమ స్యలను తీసుకుపోగా ఆమె పట్టించుకోకుండా వెళ్లిపోయింది. అయితే ఆర్‌ఓ మాత్రం మానవ తా దృక్పథంతో ఆలోచించి నిర్ణయం తీసుకు న్నారు. దీంతో గర్భిణులు, చిన్నా రుల తల్లులు ఆనందంతో ఇళ్లకు వెళ్లారు.

భోజనం టోకెన్ల కోసం నిరీక్షణ..

మధ్యాహ్నం ఔట్‌డోర్ స్టేడియంలోనే ఎన్నికల సిబ్బందికి భోజనాలు ఏర్పాటు చేశారు. అయితే కేవలం ఎన్నికల సిబ్బంది మాత్రమే ఏర్పాటు చేయడంతో ఇతరులు కూడా వస్తారేమోనన్న భయంతో టోకెన్ల సిస్టం పెట్టారు. దీంతో సిబ్బంది అంతా ఒక్కసారిగా టోకెన్ల కోసం రావడంతో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ క్రమంలో ఆర్‌ఓ చొరవ తీసుకుని విధులు కేటాయించిన సిబ్బంది తమ సెక్టోరియల్ అధికారికే టోకెన్లు పంపిణీ చేస్తామని..అక్కడే టోకె న్లు తీసుకోవాలని చెప్పడంతో కాస్త మెరుగుపడింది.

పోలింగ్ కేంద్రాలకు చేరిన ఎన్నికల సిబ్బంది

ఎన్నికల సిబ్బంది ఎన్నికల సామగ్రితో పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. ఉదయం 7 గంటలకే పోలింగ్ ప్రారంభం కానుండటంతో ముందురోజే అన్ని ఏర్పాట్లు సిద్ధం చేసుకుంటున్నారు. ఈవీఎం మిషన్లు, బ్యాలెట్ పేపర్లు, ఇతర పనులు చక్క బెట్టుకుంటున్నారు.

258 పోలింగ్ కేంద్రాలు.. 2,74,465 ఓటర్లు

కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గ పరిదిలో మొత్తం 2,74,465 ఓటర్లు ఉం డగా పురుషులు 1,32,769, మహిళలు 1,41,665, ఇతరులు 31 మంది ఉన్నారు. నియోజకవర్గ పరిధిలో 258 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల సామగ్రిని తరలించేందుకు 147 వాహనాలను ఏర్పాటు చేశారు. ఇందులో తూఫాన్లు-33, సీసీ బస్సులు 11, పాఠశాల/కళాశాల బస్సులు 93 ఉన్నాయి. పోలింగ్ కేంద్రాలలో అన్ని వసతులు రూపకల్పనకు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. వృద్ధులు, దివ్యాంగుల కోసం గుర్తించి పోలింగ్ కేంద్రా లలో ర్యాంపులు ఏర్పాటు చేశారు. పాతబస్తీ, బుధవారపేట, రోజా, బండి మెట్టతోపాటు





మిగిలిన సమస్యాత్మక కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆర్‌ఓ పోలీసు అధికారులను ఆదేశించారు.

కల్లూరు: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా పాణ్యం అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి అధికారులు ఏర్పాట్లు సర్వం సిద్ధం చేశారు. ఆదివారం నగరంలోని జి.పుల్లారెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో పాణ్యం రిటర్నింగ్ అధికారి నారపురెడ్డి మౌర్య ఆధ్వర్యంలో ఎన్నికల పోలింగ్ సామగ్రి పంపిణీ ప్రక్రియ సాగింది. పోలింగ్ అధికారులు, సిబ్బందికి ఎన్నికల నియమావళి పకడ్బందీగా అమలు చేయాలని ఆర్వో దిశానిర్దేశం చేశారు. పోలింగ్ బూత్‌ల వారిగా ఎన్నికల సామగ్రిని పంపిణీ చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు సెక్టోరల్ అధికా రులు, పీఓలు, ఏపీఓలు, ఓపీఓలు తమకు కేటాయించిన కౌంటర్లలో కూర్చుని ఈవీఎంలు, వీవీ ప్యాట్లు తీసుకున్నారు. కేటాయించిన బస్సుల్లో బూతుల వారీగా బయలుదేరారు. కొంతమంది ఏపీఓలు, ఓపీఓలు అనుకున్న సమయానికి పంపిణీ కేంద్రానికి చేరుకోకపోవడంతో రిటర్నింగ్ అధికారి అసహనం వ్యక్తం చేవారు. నియామావళి మేరకు నడుచుకోని వారికి సస్పెండ్ చేస్తానని హెచ్చరించారు. కొన్ని పోలింగ్ కేంద్రాలకు ఓపీఓలు సర్దుబాటు కాకపోవడంతో ఏపీఓలనే సర్దుబాటు చేశారు.

గూడూరు: సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌కు సర్వం సిద్ధం చేసారు. ఆదివారం పోలింగ్ సిబ్బంది పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. గూడూరు మండలంలో 40 పోలింగ్ కేంద్రాలు ఉండగా, పురుషులు ఓటర్లు 18304, స్త్రీ ఓటరు 18537, థర్డ్ జెండర్లు ఇద్దరు, మొత్తం ఓటర్లు 36,843 ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. సోమవారం పోలింగ్ నిర్వహణకు సర్వం సిద్ధం చేయగా, పోలీసులు పటిష్టమైన బందోబస్తును ఏర్పాటు చేసారు.

కోడుమూరు(రూరల్): సార్వత్రిక ఎన్నికలకు మండలంలో మొత్తం 73 పోలింగ్ కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు. మండల వ్యాప్తం గా పురుషులు 29,706 స్త్రీలు 29,763 ఇతరులు 3 ఓటు హక్కు కలిగి ఉన్నారు. ఆదివారం సాయంత్రం ఎన్నికల సిబ్బంది ఈవీఎంలు, ఫారాలు, సీళ్లు, సిరా వంటి పోలింగ్ సామగ్రిని వెంట తీసుకుని ప్రత్యేక వాహనాలలో కేంద్రాలకు చేరారు.

ఎన్నికల నిర్వహణకు పటిష్ట బందోబస్తు

ఓర్వకల్లు: నేటి ఎన్నికల నిర్వహణకు పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్‌ఐ రాజారెడ్డి ఆదివారం తెలిపారు. ఓర్వకల్లు మండలంలోని 58 పోలింగ్ బూత్‌లలో జరిగే ఎన్నికలకు గాను 70 మంది కర్నూలు జిల్లా పోలీసులు, 35 మంది సాయుధ బలగాలు, సిబ్బం దితో బందోబస్తును ఏర్పాటు చేశామన్నారు. ప్రజలు ఎటువంటి ప్రలో భాలకు లొంగకుండా నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఆయన కోరారు. ప్రతి గ్రామంలో 144 సెక్షన్ అమలులో ఉంటుందని తహసీల్దార్ నటరాజ్ తెలిపారు. కర్నూలు నుంచి ఎన్నికల సామగ్రి, సిబ్బంది ప్రత్యేక వాహనాల్లో ఆయా పోలింగ్ కేంద్రాల వద్దకు చేరుకున్నారు.





ఎన్నికల సిబ్బందికి దిశానిర్దేశం చేస్తున్న పాణ్యం రిటర్నింగ్ అధికారి నారపురెడ్డి మౌర్య


కౌంటర్లలో కూర్చున్న సెక్టోరల్ అధికారులు, పీఓలు, ఏపీఓలు, సిబ్బంది



వర్కూరులో పోలింగ్ కేంద్రానికి చేరిన ఎన్నికల సిబ్బంది

సంపత్‌నగర్‌లో విద్యుత్ సరఫరా నిలిపివేత

ఎస్‌ఈకి ఫిర్యాదు చేసిన కాలనీవాసులు

కర్నూలు(అగ్రికల్చర్), మే 12: కర్నూలు నగరంలోని బళ్లారి చౌరస్తా ఏరియా సంపత్‌నగర్ ఫస్ట్‌లైన్‌లో గంటల తరబడి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో ప్రజలు విద్యుత్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దాదాపు సంవత్సరం కాలంగా తమ వీధిలో కరెంటు సరఫరా నిలిచిపోవడం, పక్కవీధి శివయ్యనగర్‌లో నిరంతరాయంగా కరెంటు సరఫరా ఉండటం, తాము గడువులోగా కరెంటు బిల్లులు చెల్లిస్తున్నా.. అధికారులు నిర్లక్ష్యం చూపడం వల్లనే నిత్యం కరెంటు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని సంపత్‌నగర్ వీధి వాసులు ఆందోళన వ్యక్తం చేశారు. ఆదివారం సాయంత్రం తమ వీధిలో గంటల తరబడి కరెంటు సరఫరా నిలిచిపోవడంపై ఎస్‌ఈ ఉమాపతికి ఫిర్యాదు చేశారు. దీంతో సంబంధిత ఏఈపై ఎస్‌ఈ ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోసారి ఈ పరిస్థితి తలెత్తితే క్రమశిక్షణా చర్యలు తీసుకుంటానని ఏఈని ఎస్‌ఈ ఉమాపతి హెచ్చరించారు.

నేడు రైతుబజారు బంద్

కర్నూలు(అగ్రికల్చర్), మే 12: పోలింగ్ సందర్భంగా జనం ఎక్కడా గుంపు కాకూడదని పోలీసు యంత్రంగం తీసుకున్న చర్యల్లో భాగంగా నగరంలోని సీ క్యాంపు రైతుబజారును సోమవారం బంద్ చేయాలని అధికారులు ఆదేశించారు. ఈ విషయాన్ని ఎస్టేట్ అధికారి హరీష్ కుమార్ తెలియజేస్తూ తిరిగి మంగళవారం యథావిధిగా రైతుబజారును నిర్వహిస్తామని అన్నారు.

పార్లమెంటులో మహిళా బిల్లు ఆమోదం పొందాలి


పోటీలను ప్రారంభిస్తున్న డాక్టర్ శంకర్‌శర్మ

కర్నూలు(స్పోర్ట్స్), మే 12: మహిళా సాధికారత కోసం పార్లమెంటులో మహిళా బిల్లును ఆమోదం పొందాల్సిన అవసరం ఎంతైనా ఉందని సీనియర్ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ శంకర్‌శర్మ అన్నారు. ఆదివారం స్థానిక పెద్దమార్కెట్ సమీపంలో ఉన్న లక్ష్మీనరసింహ స్వామి కల్యాణ మండపంలో మాతృ దినోత్సవాన్ని పురస్కరించుకుని బాలిక క్రీడాకారులను ఆయన సన్మానించారు. అనంతరం తైక్వాండో శిక్షణా శిబిరాన్ని రిబ్బన్ కట్ చేసి ప్రారం భించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు బాగుంటే ఆ కుటుంబంతోపాటు దేశం కూడా అభివృద్ధి పథంలో నడుస్తుందని అన్నారు. దేశంలో గర్భిణులు పోషకాహార లోపాన్ని ఎదుర్కొంటున్నారని, వారికి మంచి పోషక విలువలు గల ఆహారాన్ని అందించడంతోపాటు మెరుగైన వైద్యసేవలు అందించాలని అన్నారు. బాలికలు ఆత్మరక్షణ కోసం కరాటే లాంటి మార్షల్ ఆర్ట్స్ లో శిక్షణ పొందడం అవసరమన్నారు. కార్యక్రమంలో తైక్వాండో శిక్షకుడు వెంకటేశ్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఓటర్ల చైతన్యం కోసమే అదర్శ పోలీంగ్ స్టేషన్


అందంగా తీర్చిదిద్దిన పోలీంగ్ స్టేషన్

దేవనకొండ ,మే 13: ఓటర్లలో చైతన్యం నింపేలా మండలానికో పోలీంగ్ స్టేషన్‌ని అదర్శంగా తీర్చిదిద్దారు . జిల్లా కలెక్టరు డా.సృజన ఆదేశాల మేరకు అదర్శ పోలీంగ్ స్టేషన్లను ప్రత్యేకంగా ముస్తాబు చేశారు.దేవనకొండ జెడ్పీ పాఠశాలలోని 261 పోలీంగ్ స్టేషన్లో స్వాగతం పలికేలా ద్వారం వద్ద పూల డిజైన్ ,పోలీంగ్ స్టేషన్లో మ్యాట్ పరిచి ,ఓటువేసే సమయంలో అధికంగా ఓటర్లువుంటే విశ్రాంతి కోసం కుర్చీల ఏర్పాట్లు చేశారు. ప్రజలలో ఓటు వేసేందుకు చైతన్యం నింపేలా వుంటుందని పలువురు హర్షం వ్యక్తం చేశారు.

డబ్బు పంపిణీలో నాయకులు బిజీబిజీ

మంత్రాలయం, మే 12: నియోజకవర్గంలో డబ్బులు పంపిణీలో ఆయా రాజకీయ పార్టీల నాయకులు బిజీ బిజీ అయ్యారు. ఆదివారం మధ్యాహ్నం నుంచి బరిలో ఉన్న ఇరు పార్టీల నాయకుల ఇళ్ల వద్ద ఆయా గ్రామాల పార్టీల నాయకులు, కార్యకర్తలు ఇచ్చే డబ్బులను తీసుకెళ్లి గ్రామాల్లో ఓటుకు రూ.1000, రూ.500 ప్రకారం యథేచ్ఛగా పంపిణీ చేస్తున్నా పోలీసులు సైతం పట్టించుకునే వారు లేరు. పట్టపగలే ఓటర్లకు డబ్బు, మద్యం, బిర్యాని, చికెన్ వంటివి పంపిణీ చేస్తూ ఓటర్లను ప్రలోభాలకు గురి చేశారు. తెల్లవారితే సోమవారం కావడంతో ఈ ప్రాంతంలో మాంసాహారం నిషేదంగా భావించే కుటుంబాలు ఆదివారం రాత్రే మద్యం సేవించి, మాంసాహారం భుజించి చిందులు వేశారు. గతంలో ఓటుకు రూ.500 ఇస్తుండగా.. ఈ ఎన్నికల్లో రూ.1000 పెరిగింది. అయినప్పటికీ ఓటర్లలో స్తబ్ధత నెలకొంది. గ్రామాల వారిగా ఒక పార్టీ 70 పర్సెంట్ పంపిణీ చేయగా.. మరో పార్టీ 80 శాతం పంపిణీ నగదును చేశారు. వీటిని అడ్డుకునేందుకు పోలీసు యంత్రాంగం, ఎలక్షన్ అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరించడం గమనార్హం.

యథేచ్ఛగా వైసీపీ కౌన్సిలర్ డబ్బు పంపిణీ

ఆదోని, మే 12: అధికార పార్టీ కౌన్సిలర్ ఓటర్లను తమ వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సాయిప్రసాద్ రెడ్డికే ఓటు వేయాలని డబ్బుతో ఎర వేస్తున్నారు. శనివారం పట్టణానికి చెందిన 30వ వార్డు వైసీపీ కౌన్సిలర్ బాలాజి డబ్బు పంచుతుండగా కెమెరాలకు చిక్కారు. ఓటర్లను క్యూలో నిలబెట్టి ఓటర్ స్లిప్‌లను చూపిస్తే ఒక్కో ఓటరుకు రూ.500 చొప్పున కౌన్సిలర్ బాలాజి పంపిణీ చేశారు. ఎలాగైనా డబ్బుతో ఓటర్లను కొనాలని అధికార పార్టీ వైసీపీ అభ్యర్థి ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి చూస్తున్నారు. దీని పై ప్రజలు అయన పై ఓటు ద్వారా తామేంటో చూపిస్తామని చెబుతున్నారు.


ఓటర్లకు డబ్బు పంచుతున్న వైసీపీ కౌన్సిలర్ బాలాజీ

పోలింగ్‌కు ఏర్పాట్లు సిద్ధం

తుగ్గలి, మే 12: సోమవారం జరగబోయే సార్వత్రిక ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశామని తహసీల్దార్ షర్మిళ తెలిపారు. ఆదివారం మండల కేంద్రమైన తుగ్గలి, తదితర గ్రామాల్లోని పోలింగ్ స్టేషన్లను ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో మొత్తం 55 పోలింగ్ స్టేషన్‌లలో 49,316 ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకుంటున్నారనీ, పోలింగ్ కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశామని, ఇప్పటికే పోలింగ్ సిబ్బంది అంతా కేంద్రాలకు చేరుకున్నారనీ, ఎలాంటి అల్లర్లు జరగకుండా పోలిసు సిబ్బంది, బలగాలు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. పోలింగ్ కేంద్రానికి ఓటు హక్కు వినియోగించుకునే వారే రావాలని, క్యూలైన్లు పాటించాలని తెలిపారు. అలాగే వంద మీటర్ల దూరంలో ఉండాలని, గుంపులు గుంపులుగా ఉండకూడదన్నారు.

కర్ణాటక మద్యం, నగదు సీజ్

తుగ్గలి, మే 12: మండలంలోని చెన్నంపల్లిలో కర్ణాటక మద్యం అమ్ముతున్న వ్యక్తిని పోలీసులు అదుపులో తీసుకున్నారు. అలాగే రాంపల్లె రోడ్డులో నగదుతో వెళుతున్న ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకుని నగదును ఫ్లయింగ్ స్క్వాడ్ స్వాధీనం చేసుకుని జొన్నగిరి పోలీసులకు అప్పగించారు. ఆదివారం జొన్నగిరి పోలిస్‌స్టేషన్‌లో జొన్నగిరి ఎస్ఐ రామాంజనేయులు తెలిపిన వివరాల మేరకు ఫ్లయింగ్ స్క్వాడ్ జరిపిన దాడుల్లో చెన్నంపల్లికి చెందిన నారాయణ అనే వ్యక్తి నుంచి రెండు బాక్సుల్లో అక్రమ కర్ణాటక మద్యం టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని, అలాగే మరో వ్యక్తి రాంపల్లె రోడ్డులో వెళ్తుండగా.. అతనిని తనిఖీలు చేయగా.. అతని వద్ద రూ.1,48,500లను స్వాధీనం చేసుకుని స్టేషన్‌లో అప్పగించారన్నారు. వారిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపామన్నారు. మండలంలో ఎక్కడైనా అక్రమ మద్యం, డబ్బులు పంపిణీ జరుగుతుంటే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలన్నారు.

మద్దికెరలో సర్వం సిద్ధం

మద్దికెర, మే 12: మద్దికెర మండలంలో సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు సర్వం సిద్దం చేసినట్లు ఎన్నికల అధికారులు అలివేలమ్మ, రజాక్‌వలి తెలిపారు. ఆదివారం మండలంలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు ఓటు వేసేందుకు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశారన్నారు. ఎన్నికల అధికారుల ఆదేశాల మేరకు మోడల్ పోలింగ్ కేంద్రాన్ని అందంగా తయారు చేశారు. మండలంలో 18 నుంచి 51 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయనీ తెలిపారు. పురుషులు 14,592 ఓట్లు ఉండగా.. మహిళలు 14,744 ఓట్లు ఉన్నాయన్నారు. మొత్తం 29,592 ఓట్లు ఉన్నాయన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని తెలిపారు. ఆయా పోలింగ్ కేంద్రాల్లో 144 సెక్షన్ అమలులో ఉంటుందని, పోలిసు బందోబస్తు కూడా పటిష్టంగా ఏర్పాటు చేశామన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను కూడా గుర్తించామని తెలిపారు. ఓటర్లు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ప్రతి ఓటరుకు అన్ని సౌకర్యాలు కూడా ఏర్పాటు చేశామని, పోలింగ్ కేంద్రాల వద్ద హెల్ప్‌లైన్ కూడా ఏర్పాటు చేశామని తెలిపారు.

మార్పా... కొనసాగింపా?

- నేడు నిర్ణయించనున్న ఓటరు...
- ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్



ఆదోని, మే 12: చూపుడు వేలిపై ఓ చుక్క..! ఈవీఎంలో నొక్కే ఓ మీట..! ఆ వెంటన వచ్చే బీప్ శబ్దం..! ఈ మొత్తం ప్రక్రియకు రెండు నుంచి మూడు నిమిషాలు పడుతుంది. కానీ ఇదే.. ఐదేళ్ల రాష్ట్ర భవిష్యత్తును నిర్ణయిస్తుంది...! మన బతుకులు ఎలా ఉండాలో నిర్దేశిస్తుంది...! రాబోయే ఐదేళ్ల పాలనకు అంకురార్పన చేస్తుంది...! కొత్త ప్రభుత్వాన్ని... మన నాయకుడిని నిర్ణయిస్తుంది...! స్వేచ్ఛ, సమానత్వంతో కూడిన ప్రజాస్వామ్యాన్ని పరిపుష్టం చేస్తుంది...! అందుకే ఓటేద్దాం రండి...! మన తలరాతను మనమే రాసుకుందాం... తరలిరండి...!!

● ఓటేద్దాం పదండి....

అసెంబ్లీ ఎన్నికల పోలింగ్‌కు సర్వం సిద్దమైంది. తమను ఆదరించాలని 56 రోజులుగా అభ్యర్థులు ప్రచారం చేసిన నేపథ్యంలో ఓటరు ఎవరిని కరుణించనున్నాడు...? ఏ పార్టీ వైపు మొగ్గు చూపుతున్నాడు...? అన్నది నేడు ఈవీఎంలో నిక్షిప్తం కానున్నది... నేడు పోలింగ్ నేపథ్యంలో ఆదివారం డిస్ట్రిబ్యూషన్ రిసెప్షన్ కౌంటింగ్ (డీఆర్‌సీ) కేంద్రాల నుండి బ్యాలెట్ కంట్రోల్ యూనిట్‌లు, వీవీ ప్యాట్ యంత్రాలతో సిబ్బంది పోలింగ్ కేంద్రాలకు వెళ్లారు. ఆదోని నియోజకవర్గంలో 2,63,058 ఓటర్లు ఉండగా, ఆదోని మండలంతో పాటు పట్టణంలోని 42 వార్డులకు గానూ 256 పోలింగ్ కేంద్రాలు, అందులో రూరల్ 97, అర్బన్ 159 కేంద్రాలను ఏర్పాటు చేశారు. 2,513 మంది సిబ్బంది ఎన్నికల విధుల్లో పాల్గొనున్నారు. సున్నిత ప్రాంతాలుగా గుర్తించిన పోలింగ్ కేంద్రాల వద్ద అదనపు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. ప్రచారం ముగిసిన అనంతరం పలు ప్రాంతాల్లో నగదు, మద్యం, పంపిణీ సాగింది. బస్తీల్లో రూ.500 నుంచి రూ.1000 వరకు అభ్యర్థులు పంచినట్లు తెలిసింది.

● ఓటర్ల స్లిప్పు రాకున్నా....

మీ పోలింగ్ కేంద్రం ఎక్కడుందో ఆన్‌లైన్‌లో తెలుసుకోవచ్చని డీఈవో తెలిపారు. ఓటరు హెల్ప్‌లైన్ యాప్, లేదా అఫీషియల్ ఈసీఐ వెబ్‌సైట్ల ద్వారా మీ ఎపిక్ నెంబర్ ఆధారంగా, లేదా 1950కి ఫోన్ చేసి పోలింగ్ కేంద్రం లోకేషన్ తెలుసుకోవచ్చన్నారు. పోలింగ్ కేంద్రం వద్ద ఓటర్ల క్యూ ఎలా ఉందన్నది తెలుసుకునేందుకు పోల్ క్యూ రూట్ యాప్ అందుబాటులో ఉంటుందని ఎన్నికల అధికారి శివ్‌నారాయణ్ శర్మ తెలిపారు.


ఎన్నికల సామాగ్రిని తీసుకెళ్తున్న సిబ్బంది


ఎన్నికల ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న అబ్జార్వర్ సమీర్ తారిఖ్ అలీ, సబ్ కలెక్టర్ శివ్‌నారాయణ్ శర్మ

మంత్రాలయంలో ఏర్పాట్లు పూర్తి

మంత్రాలయం, మే 12: నియోజకవర్గంలో 237 పోలింగ్ కేంద్రాలకు సర్వం సిద్ధం చేసినట్లు మంత్రాలయం రిటర్నింగ్ అధికారి మురళి, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి శ్రీధర్‌మూర్తి తెలిపారు. ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు 1537 పోలింగ్ కేంద్రాలకు గానూ పీవో, ఏపీవో, ఓపీవోలను సిద్ధం చేశామన్నారు. అదే విధంగా మైక్రో అబ్జర్వర్లు 19 మంది అబ్జర్వేషన్‌లో ఉంటారని తెలిపారు. ప్రతి ఈవీఎంను పూర్తి భద్రత నిబంధనల ప్రకారం పీవో, ఏపీవోలకు రూట్ల వారిగా కేటాయించామన్నారు. ఇందుకోసం ఆయా రూట్లలో 42 కర్ణాటకకు చెందిన ఆర్టీసీ బస్సులు, పది ఆంధ్ర రాష్ట్రానికి చెందిన బస్సులు, ప్రైవేటు బస్సులు సిద్ధం చేసి ఎన్నికల సామాగ్రిని ఆయా పోలింగ్ కేంద్రాలకు తరలించామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా డీఎస్పీ సీతారామాంజనేయులు మాట్లాడుతూ నియోజకవర్గంలోని కోసిగి, పెద్దకడుబూరు, కౌతాళం, మంత్రాలయం నాలుగు మండలాలకు ఒక డీఎస్పీ, ఆరుగురు సీఐలు, పది మంది ఎస్ఐలు, ఏఎస్ఐలు, హెడ్ కానిస్టేబుళ్లు 150 మంది, హోంగార్డులు 100 మంది, కేంద్ర బలగాలు వంద మందితో బందోబస్తు విధులు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు.


ఈవీఎం కౌంటర్ కేంద్రం వద్ద హెచ్చరికలు జారీ చేస్తున్న ఆర్వో మురళి

నియోజకవర్గంలో 24 సమస్యాత్మక గ్రామాలు గుర్తించామని, అందులో స్పెషల్ బలగాలతో పాటు స్థానిక పీసీలను ఏర్పాటు చేశామని వివరించారు. నేషనల్ ఆర్మీ పోలీసు, 25 రూట్ మొబైల్స్, క్యూఆర్టీలు 4 టీములు ఏర్పాటు చేశామన్నారు. ఈ విధుల్లో పోలింగ్ సిబ్బందికి అన్ని రకాల వసతులు, తాగునీరు, భోజన వసతులు కల్పించామన్నారు. ఈ కార్యక్రమంలో ఎలక్షన్ డీటీలు గురు రాజ్‌రావు, రాఘవేంద్ర, శశిశేఖర్ రావు, సీఐ ఎరిషావలి, ఎస్ఐలు గోపినాథ్, కృష్ణమూర్తి, ఏఈలు నరసింహులు, ఏపీవో తిమ్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



-03 ఈవీఎంల తరలింపునకు సిద్ధం చేసిన కర్ణాటక బస్సులు , పోలీసులకు డ్యూటీలు వేస్తున్న అధికారులు

ఆలూరులో 294 పోలింగ్ కేంద్రాలు


ఆలూరులో ఎన్నికల విధులకు హాజరైన సిబ్బంది


ఎన్నికల సామాగ్రితో తరలుతున్న సిబ్బంది

ఆలూరు, మే 12: సార్వత్రిక ఎన్నికలు సోమవారం జరుగుతుండటంతో ఆదివారం ఎన్నికల అధికారులు అన్ని ఏర్పాటు చేశారు. స్థానిక ప్రభుత్వ కళాశాల మైదానంలో ఎన్నికల సిబ్బందికి కేంద్రాలను కేటాయించి ఎన్నికల సామాగ్రిని అందజేసినట్లు ఆలూరు ఎన్నికల రిటర్నింగ్ అధికారి రామునాయక్ తెలిపారు. ఆలూరు అసెంబ్లీ-147 పరిధిలో ఆలూరు, హాలహర్వి, చిప్పగిరి, హోళగుంద, దేవనకొండ, ఆస్పరి కలిసి మొత్తం 6 మండలాలు ఉండగా అందులో పురుషులు 1,30,083, మహిళలు 1,28,861, థర్డ్ జెండర్ 53 కలిపి మొత్తం 2,58,997 ఓట్లు ఉన్నాయన్నారు. 294 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఇందుకోసం పీవోలు 294 మంది పోలింగ్ ఆఫీసర్లను, 294 మంది అసిస్టెంట్ పోలింగ్ ఆఫీసర్లు, ఓపీఓలు 1,178, సెక్టోరియల్ అధికారులు 29, రూట్ అధికారులు 176, రిజర్వు సిబ్బంది 230ను నియమించినట్లు తెలిపారు. పోలింగ్ కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు చేశామన్నారు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కును ఉపయోగించుకోవాలన్నారు. పోలింగ్ సోమవారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు జరుగుతుందన్నారు. అలాగే రైల్వే శాఖ డీఎస్పీ చౌడేశ్వరి ఆధ్వర్యంలో మరో డీఎస్పీ కొండయ్య, ఏడుగురు సీఐలు, ఎస్ఐలు, స్పెషల్ పార్టీ, రిజర్వు పోలీసు సిబ్బందిని నియమించనున్నారు. పోలింగ్ సందర్భంగా ఎలాంటి అవాంచనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా భారీ పోలీసు బలగాలను నియమించామని ఆలూరు సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

పోలింగ్‌కేంద్రాలకు చేరుకున్న సిబ్బంది

- పత్తికొండలో ఎన్నికలనిర్వహణకు సర్వం సిద్ధం
- విధుల్లో 1851 మంది సిబ్బంది, 444 మంది పోలీసులు

పత్తికొండ, మే 12 : సార్వత్రిక ఎన్నికలకు పత్తికొండ నియోజకవర్గంలో అన్నిఏర్పాట్లు పూర్తిచేశామని ఆర్‌వో రామలక్ష్మితెలిపారు, పోలింగ్ నిర్వహణకు సంబంధించి 27రూట్లు ఏర్పాటుచేశామని ,పీవో, ఏపీవో, ఇతరసిబ్బంది మొత్తం1851 మంది 255 పోలింగ్ కేంద్రాలలో విదులు నిర్వహిస్తారని ఆమె తెలిపారు, ఆదివారం స్థానిక జూనియర్‌కళాశాల ఆవరణలో ఎన్నికలసిబ్బందికి ఈవీఎం కిట్లు, ఇదరసామాగ్రిని ఎన్నికలసిబ్బందికి అప్పగించారు, వారికి కేటాయించిన రూట్‌లప్రకారం కేటాయించిన ఆర్టీసీ బస్సుల్లో సిబ్బంది పోలింగ్‌కేంద్రాలకు చేరుకున్నారు. కాగా ఎన్నికలవిదులకు వచ్చిన మహిళాఉద్యోగులు కొందరికి చంటిపిల్లలు ఉండడంతో వారికి తోడుగా భర్తలు వచ్చి పిల్లలబాధ్యతలను తీసుకుని కనిపించారు.

విధుల్లో 444 మంది పోలీసులు

13వ తేది సోమవారం జరిగే సార్వత్రిక ఎన్నికల విదుల్లో తనతోపాటు మొత్తం 444 మంది పోలీసులు విదుల్లో పాల్గొంటారని పత్తికొండ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి తెలిపారు. డిఎస్పి -1, సీఐలు 3, ఎస్ఐలు 10 మందితోపాటు పోలీసులు విదుల్లో ఉంటారన్నారు.


చంటిపిల్లతో విధుల్లో...

సమస్యాత్మక పోలింగ్‌కేంద్రాలపై ప్రత్యేకదృష్టి ఉంచామన్నారు.

అభ్యర్థుల ఓటు హక్కు

పత్తికొండ అసెంబ్లీ ఎన్నికల బరిలోనిలిచిన టీడీపీ అభ్యర్థి కేఈ శ్యాంబాబు పత్తికొండ పట్టణంలోని 59వ పోలింగ్ బూత్‌లో ఓట హక్కు వినియోగించుకోనుండగా , వైసీపీ అభ్యర్థి కంగాటి శ్రీదేవి స్వగ్రామం చెరుకులపాడులో ఓటువేయనున్నారు. సీపీఐ అభ్యర్థి రామచంద్రయ్య పత్తికొండలో ఓటువేయనున్నారు.

నేడే పోలింగ్

- గ్రామాలకు తరలిని ఎన్నికల సిబ్బంది
- వెబ్‌కాస్టింగ్, ప్రత్యేక పోలీస్ బందోబస్తు
- ప్రశాంతంగా ఓటు హక్కు వినియోగించుకోవాలి : ఆర్వో


ఎన్నికల సిబ్బందికి డ్యూటీలు వేస్తున్న ఆర్వో చిరంజీవి


పోలీస్ సిబ్బందికి డ్యూటీలు వేస్తున్న ఏఆర్ అడిషనల్ ఎస్పీ జి.నాగబాబు

ఎమ్మిగనూరు, మే 12: సార్వత్రికల సమరానికి ఎన్నికల అధికారులు సర్వం సిద్ధం చేశారు. నేడు ఎమ్మిగనూరు-144 అసెంబ్లీకి జరిగే ఎన్నికల్లో ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు అవసరమైన ఏర్పాట్లను ఎన్నికల అధికారులు పూర్తి చేశారు. నియోజకవర్గంలో ఎమ్మిగనూరు పట్టణంతో పాటు ఎమ్మిగనూరు రూరల్, నందవరం, గోనెగండ్ల మండలాల్లో మొత్తం 272 పోలింగ్ బూత్‌లు ఉన్నాయి. ఒకొక్క పోలింగ్ బూత్‌కు ఆరుమంది ప్రకారం 1632మంది సిబ్బందిని అధికారులు నియమించారు. వీరికి స్థానిక జూనియర్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన శిబిరంలో ఎన్నికల సామాగ్రిని అందజేశారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వాహనాల్లో ఆయా గ్రామాలకు పోలింగ్ సిబ్బంది చేరుకున్నారు. అక్కడ ఓటర్లు ఓటు వేసేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. కాగా నియోజకవర్గంలో 22 సమస్యాత్మక గ్రామాలు ఉండగా వాటిలో 33 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయి. పోలింగ్ ప్రశాంతంగా జరిగేందుకు ఆయా గ్రామాల్లో 400 మంది పోలీస్ సిబ్బందితో పాటు రెండు ప్రత్యేక బెటాలియన్ పోలీసు బృందాలు, కర్ణాటక పోలీసులను ఏర్పాటు చేశారు. అలాగే ఆయా పోలింగ్ స్టేషన్లలో వెబ్‌కాస్టింగ్ ఏర్పాటు చేశారు. 20 మంది మైక్రోఅబ్జర్‌వర్స్, 20 వీడియోగ్రాఫర్స్‌ను ఏర్పాటు చేశారు. కాగా నియోజకవర్గంలోని మూడు మండలాలు, ఎమ్మిగనూరు పట్టణంలో 2,47,752 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో మహిళలు 1,25,664మంది, పురుషులు 1,22,041మంది, థర్డ్‌జెండర్స్ 47 మంది ఉన్నారు. వీరంతా నేడు ఓటు హక్కును వినియోగించుకోనున్నారు.

ఓటర్లు ప్రశాంతంగా ఓటు హక్కును వినియోగించుకోవాలి

ఎమ్మిగనూరు నియోజకవర్గంలో ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేయడం జరిగిందన్నారు. పోలింగ్ సిబ్బంది ఎన్నికల సామాగ్రితో ప్రశాంతంగా పోలింగ్ స్టేషన్లకు చేరుకున్నారని తెలిపారు. సోమవారం ఉదయం 7గంటలకే ఓటింగ్ ప్రారంభం అవుతుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ తప్పకుండా తమ ఓటు వినియోగించుకోవాలని కోరారు.

ఇరువర్గాల మధ్య ఘర్షణ

- నగదు పంపిణీ విషయంలో గొడవ
- రాళ్లతో దాడులు చేసుకున్న ఇరువర్గాలు
- పలువురికి గాయాలు

హొళగుంద, మే 12: హొళగుంద మండల పరిధిలోని ఎల్లార్తి గ్రామంలో వైసీపీ, టీడీపీ వర్గాల మధ్య రాత్రి 11 గంటల సమయంలో ఘర్షణ చోటుచేసుకున్నట్లు స్థానికులు తెలిపారు. సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ఇరువర్గాలకు చెందిన నాయకులు ఓటర్లకు నగదు పంపిణీ చేస్తుండగా, ఇరువర్గాలకు చెందిన నాయకులు రాళ్లతో దాడులకు పాల్పడినట్లు తెలిపారు. గ్రామంలో ఉద్రిక్తత నెలకొనడంతో పోలీసులు ఇరువర్గాలను చెదరగొట్టి, గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. దాడులకు పాల్పడిన ఇరువర్గాల పై పోలీసులు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

రుద్రమూర్తికి ప్రత్యేక పూజలు


రుద్రమూర్తికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

శ్రీశైలం, మే 12: శ్రీశైల మహాక్షేత్రంలో ఆదివారం ఆరుద్రనక్షత్రం పురస్కరించుకుని లోకకల్యాణార్థం రుద్రవనంలోని రుద్రమూర్తికి దేవస్థానం విశేష అభిషేకం పూజలు నిర్వహించింది. వైశాఖమాసంలో రుద్ర విగ్రహాన్ని నెలకొల్పడం కారణంగా ప్రతి సంవత్సరం వైశాఖమాసంలో ఆరుద్రనక్షత్రం రోజున రుద్రమూర్తికి దేవస్థానం ప్రత్యేక పూజలు జరిపిస్తోంది. అర్చకులు రుద్రమంత్రాలను పఠిస్తుండగా శాస్త్రోక్తంగా పంచామృతాలతోనూ, గంధోధకం, భస్మోదకం, పుష్పోదకం, బిల్వోదకం, సుగంధోదకాలతో, జలంతో అభిషేకం నిర్వహించారు. అనంతరం రుద్రదేవుడికి బిల్వార్చనను జరిపి వివిధ పుష్పాలతో పుష్పార్చన చేశారు. రుద్రదేవుని చల్లని చూపు ఎల్లప్పుడూ కృష్ణానదిపై ప్రసరించడం వల్ల నందిలో నీరు సమృద్ధిగా ఉండి, పంటలు బాగా పండుతాయని, అలాగే శ్రీశైలం ఆనకట్ట ఎల్లప్పుడూ పరిరక్షింపబడుతుందని పలువురు ఆధ్యాత్మికవేత్తలు సూచించడంతో ఆలయానికి ఈశాన్యభాగంలో కృష్ణానదిపై రుద్రుడి దృష్టి పడే విధంగా దేవస్థానం విగ్రహాన్ని నెలకొల్పింది. కార్యక్రమంలో ఆలయ ఈవో డి.పెద్దిరాజు, సహాయ కార్యనిర్వహణాధికారి మల్లికార్జునరెడ్డి, ప్రజాసంబంధాల అధికారి శ్రీనివాసరావు, ఉపప్రధానార్చకులు శంకరయ్యస్వామి, అధ్యాపక పూర్ణానందం, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆదిశంకరాచార్యుల జయంతి

మహానంది, మే 12: ఆదిశంకరాచార్యుల 2097 జయంతి వేడుకలను ఆదివారం మహానంది క్షేత్రంలో వేదపండితులు ఘనంగా నిర్వహించారు. ఆలయం ప్రాగణం లోని కల్యాణ మండ పంలో ఆదిశంకరాచార్యుల చిత్రపటానికి పూలమాల వేసి ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం నగర సంకీర్తనను భక్తిశ్రద్ధ లతో నిర్వహించారు. వేదపండితులు రవిశంకర్ అవధాని, నాగేశ్వరశర్మ, ప్రధాన అర్చకులు మామిళ్ళపల్లి అర్జునశర్మ, శరభయ్యశర్మ, ఆలయ ఏఈవో ఎర్రమల్ల మధు, సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీశైలం: శ్రీశైల మహాక్షేత్రంలో ఆదివారం వైశాఖ శుద్ధ పంచమి సందర్భంగా ఆదిశంకరుల జయంతి ఉత్సవాన్ని దేవస్థానం వైభవంగా నిర్వహించింది. ఉత్సవంలో భాగంగా పాలధార పంచధార వద్ద ఉన్న శంకర మందిరంలోని శంకరులకు ప్రత్యేక అభిషేక పూజలు జరిపింది. పూజా కార్యక్రమంలో లోకకల్యాణాన్ని కాంక్షిస్తూ సంకల్పం పఠించి మహాగణపతికి పూజలు జరిపారు. తరువాత వేదమంత్రాలతో చంద్రమౌళీశ్వర స్వామికి, శారదాదేవికి, శంకరులకు అభిషేకం నిర్వహించారు. అనంతరం పుష్పార్చన, నివేదనలు సమర్పించారు.